ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి


జిల్లా వార్తలు

ఆదివారం 13 జూలై 2025 | 5



వరద గోదారి

సముద్రంలోకి 5.29 లక్షల క్యూసెక్కులు



అందుకుంటూ : రోడ్ కం రైలు బ్రిడ్జిని తాకేలా గోదావరి వరద

పరుగో..పరుగు : బొబ్బర్లంక వద్ద వరద ఉధృతి

గోదావరికి వరద పోటెత్తింది.. నిండు కుండలా మారింది.. లంకలను ముంచుతూ దిగువకు దూసుకొస్తోంది.. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో అఖండ గోదావరి ఉరుకులు.. పరుగులు పెడుతోంది.. ఈ ఏడాది తొలిసారి వరద ఉధృతంగా మారింది.. సముద్రంలోకి సుమారు 5.29 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.. ఇంత ఎక్కువ నీరు విడుదల చేయడం ఈ ఏడాది ఇదే. ఇది ఏడు లక్షల వరకూ పెరగవచ్చని అంచనా.. నిన్నటి వరకూ ఎంతో ప్రశాంతంగా ఉన్న గోదావరి శనివారం ఒక్కసారిగా ఉధృతంగా మారడంతో జనం చూసేందుకు ఎగబడుతున్నారు.. ఎగువున తగ్గుముఖం పట్టడంతో దిగువన వరద ఉధృతి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

6

రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు మినిస్టీరియల్ అవార్డు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగర పాలక సంస్థకు స్టేట్ లెవెల్ మినిస్టీరియల్ అవార్డు లభించింది. గతంలో దేశంలో మంచి ర్యాంక్‌లు సాధించిన నగరాలను పరిశీలించి వాటికి జాతీయ స్థాయిలో సూపర్ లీగ్ సీటీస్‌గా, స్పెషల్ స్పెషల్ కేటగిరి,మినిస్టీరియల్ అవార్డులకు ఎంపిక చేసి కేంద్రప్రభుత్వం శనివారం ప్రకటించింది. నగరపాలక సంస్థకు కమిషనర్‌గా పనిచేసి ఇటీవల బదిలీ అయిన కేతన్‌గార్గ్, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, కార్మికులు నగర శుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. పరిశుభ్రత, మెరుగైన పారిశుధ్యం, శాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని మినిస్టీరియల్ అవార్డును రాష్ట్రస్థాయిలో ఎంపిక చేశారు. ఈ మేరకు అవార్డు వరించింది.ఈ అవార్డును ఈనెల 17న దేశరాజధాని ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర మంత్రి చేతుల మీదుగా ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ పి.ప్రశాంతి అందుకుంటారు. అవార్డుతో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కీర్తి ఇనుమడించబోతుంది.



అవార్డు బాధ్యత పెంచింది



రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు స్వచ్ఛసర్వేక్షణ్‌లో స్టేట్ లెవెల్ మినిస్టీరియల్ అవార్డు రావడం నగరాభివృద్ధిలో కీలక మైలురాయి. నగరపాలక సంస్థ చేపట్టిన అభివృద్ధి ప్రజా సేవా కార్యక్రమాలకు ఇది లభించిన గౌరవప్రద గుర్తింపు. ఆ గుర్తింపును నిలబెట్టుకుంటాం. పారిశుధ్యంపై మరింత దృష్టి సారిస్తాం. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు రావడం ఆనందంగా ఉంది. **- ప్రశాంతి, కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్**

ఆదివారం ప్రత్యేకం



అదిగో పులి!

అచ్చంగా 'పులి' లెక్క.. కానీ ఇది ఫిషింగ్ క్యాట్

కేరాఫ్ కోరంగి..

చూడ్డానికి అందంగా, గుబురుగా.. దట్టంగా కనిపించే మడ అడవులు దేశంలో కాకినాడకే ప్రత్యేకం. రాష్ట్రంలో గోదావరి పరీవాహక ప్రాంతంలో 331.5 చదరపు కిలోమీటర్లలో ఇవి విస్తరించగా కృష్ణా పరీవాహక ప్రాంతంలో 250 చదరపు కిలోమీటర్లు ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తాళ్లరేవు మండలం కోరంగి నుంచి ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లో 58 వేల ఎకరాల్లో ఉన్నాయి. మడ అడవుల్లో 80 రకాల వృక్షజాతులున్నాయి. ఏటా ఎనిమిది దేశాల నుంచి 120 జాతుల వలస పక్షులు వస్తాయి. వందల రకాల చేప జాతులు ఇక్కడకు వచ్చి గుడ్లు పొదుగుతాయి. ఎన్నో రకాల పక్షి, జంతుజాతులు ఉండగా వాటిలో ప్రత్యేకత సంతరించుకున్నవే ఫిషింగ్ క్యాట్‌లు. ప్రపంచంలో ఇవి పది వేల వరకు ఉండగా దేశంలో రెండు వేలలోపే ఉన్నాయి. ఇందులో 155 కోరంగిలోనే ఉన్నాయి. ఇప్పుడు నాలుగేళ్ల తర్వాత వీటి సంఖ్య లెక్కించడానికి అటవీ శాఖ రంగంలోకి దిగింది. దేశంలోనే తొలిసారిగా వీటి సంఖ్యను లెక్కించడానికి రేడియో కాలర్ రింగ్ విధా నం అమలు చేస్తున్నారు. ఈ ఫిషింగ్ క్యాట్‌ల మెడకు వీటిని బిగించి కొన్ని రోజుల పాటు అధ్యయనం చేయడానికి డెహ్రాడూన్ నుంచి నిపుణులు వచ్చి కోరంగిలో మకాం వేశారు. మూడింటికి వీటిని బిగించారు. త్వరలో మరో ఏడింటికి బిగించబోతున్నారు.

- కోరంగి అభయారణ్యం ఆవాసం
- సరికొత్తగా ఫిషింగ్ క్యాట్‌ల లెక్క
- మత్స్యసంపద వృద్ధిలో కీలకం
- వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ప్రాజెక్టు
- వీటి మెడకు రేడియో కాలర్ రింగ్
- దేశంలోనే తొలిసారిగా కౌంటింగ్
- అంతరించే జాతిలో ఈ క్యాట్‌లు
- జియోట్యాగింగ్‌తో పరిశీలన

వాటిని చూస్తేనే ఒళ్లు జలదరిస్తుంది.. రాత్రి వేళలో కనిపిస్తే గుండేజల్లుమంటుంది.. చిరుత పులిలా ఒంటి నిండా చారలు.. కోర మీసాలు.. పులి తరహాలో కళ్లు..అమ్మో మీదకు వచ్చేస్తుందే మోనని భయపెడుతుంది..కానీ అది పులికాదు.. అచ్చం పులినే తలపించే ఆ తరహా జాతికి చెందినదే.. ఎత్తు తక్కువే కాని పులినే పోలి ఉంటుంది.. నోరు తెరిస్తే భయంకరమైన పళ్లు... పొడవాటి నాలుక.. నిజంగా పులే అని భయపడేలా చేస్తుంది.. ఇంతకీ దీని పేరేమిటో తెలుసా.. ఫిషింగ్ క్యాట్..

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

నిజమైన పులి జంతువులను వేటాడడంలో ఎంత నేర్పరో..ఈ ఫిషింగ్ క్యాట్ (బావురుపిల్లి, నీటి పిల్లి) నీటిలో చేపలను వేటాడి తినడంలో ఎంతో నేర్పరి.. ఇది తినే చేపలతో సముద్రంలో మత్స్య సంపద పెరగడానికి దోహదపడుతుంది.. ఇదేంటి చేపలను తినే పిల్లి వల్ల చేప సంపద ఎలా పెరుగుతుంది అంటారా.. నిజమే.. చేపలు పెట్టే గుడ్లను తినే చేప జాతులు ఎన్నో మడ అడవుల్లో ఉన్నాయి..అలా గుడ్లను తింటూ మత్స్య సంపద పెరగకుండా చేసే చేపలనే ఈ ఫిషింగ్ క్యాట్‌లు తింటాయి..ఈ ఫిషింగ్ క్యాట్‌లు ఐయూసీఎన్ జాబితాలో అంతరించిపోయే ప్రమాదం ఉన్న జాతిగా గుర్తించారు.ఈ ఫిషింగ్ క్యాట్‌లకు కోరంగి అభయారణ్యం పెట్టింది పేరు.

నిరంతర పర్యవేక్షణ..

దేశంలోనే కోరంగి అభయారణ్యంలో వీటిని లెక్కించడానికి వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రత్యేక ఆసక్తి కనబర్చింది. వాస్తవానికి కోల్‌కతాలోని సుందర్‌బన్ అడవుల్లో వీటి జాడ ఎక్కువ.ఈ ఫిషింగ్ క్యాట్ పశ్చిమబెంగాల్ రాష్ట్ర అధికారిక జంతువు కూడా. అయితే కోరంగిలోనే వీటి లెక్కింపునకు అనువైన వాతావరణం ఉండడంతో దేశంలో తొలిసారి ఇక్కడే ఇటీవల ప్రారంభించారు.ఈ ప్రాజెక్టును డెహ్రాడూన్‌లోని వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ బిలాల్ హబీబ్ పర్యవేక్షిస్తుండగా కోరంగికి సైంటిస్ట్ షాహిర్‌ఖాన్, వెటర్నరీ ఆఫీసర్ సనంత్ వచ్చారు. వీరిలో సనంత్ దేశంలో ఇప్పటి వరకు 100కుపైగా పులులకు నెక్ రేడియోకాలరింగ్ అమర్చడంలో పేరు పొందారు. ఈ రేడియో కాల ర్ రింగ్‌కు జియో ట్యాగింగ్ చేసి నిత్యం వీటి కదలికలను పరిశీలిస్తున్నారు. అలాగే 90చోట్ల చెట్లకు ట్రాప్ కెమెరాలు అమర్చారు. త ద్వారా కోరం గిలో వీటి సంఖ్యను నిర్ధారించనున్నారు.

ఈదేస్తాయి..వేటాడేస్తాయి..

అచ్చం పులిని తలపించే ఈ ఫిషింగ్ క్యాట్‌లకు ఎంతో ప్రత్యేకత ఉంది. అసలు పులులు జంతువులను వేటాడడంలో ఎంత నేర్పరో ఇవి కూడా నీటి అడుగున ఉండే చేపలను తినడంలో నేర్పరులు. వాస్తవానికి సముద్రం, గోదావరి నీరు సంగమించే ప్రాంతంలో ఉప్పు, చప్పటి నీరు ఉంటుంది. ఇది చేప సంతతి వృద్ధికి అనుకూలం.అందుకే ఎన్నో రకాల మత్స్య జాతులు మడఅడవుల్లోకి వచ్చి గుడ్లు పొదుగుతాయి.ఇవి పిల్లలుగా మారడానికి మడ అడవుల్లోని చిత్తడి నేలలు అత్యంత అనుకూలం. ఈ గుడ్లను కొన్ని రకాల చేపలు తినేస్తాయి. తద్వారా మత్స్య సంపద వృద్ధికి ఇవి హాని చేస్తాయి. ఇలా గుడ్లు తినేసే కొన్ని రకాల జాతి చేపలను ఈ ఫిషింగ్ క్యాట్‌లు తింటాయి. తద్వారా సముద్రంలో మత్స్య సంపద పెరగడానికి దోహదపడతాయి. పులి తరహాలో కొంత దూకుడు స్వభావం ఉంటుంది. మనుషులకు హాని చేయవు.ఇప్పుడు వీటి సంఖ్య లెక్కిస్తున్నామని కోరంగి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, డీఎఫ్‌వో రవీంద్ర నాథ్‌రెడ్డి వివరించారు.



ఫిషింగ్ క్యాట్‌లకు నెక్ రేడియోకాలర్ రింగ్ చేస్తున్న నిపుణులు

గూడు..గోడు!

- 1595 నిర్మాణాలు ఆన్‌లైన్
- ఇంకనూ పూర్తికాని లాగిన్
- బిల్లులందక నీరసం
- అసంపూర్తిగా నిర్మాణాలు



(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

పేదలకు గూడు గోడు తప్పడంలేదు.. ప్రభుత్వ సాయం సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నారు. సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకుంటే రూ.2.5 లక్షల రుణం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లాలోని హౌసింగ్ అధికారుల అనుమతితో అనేక మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈ ఏడాది జూన్ రెండో తేదీన చాలా మందికి శాంక్షన్ ఆర్డర్లు వచ్చాయి. కొందరు బేస్‌మెంట్ వరకూ నిర్మించగా..కొందరు శ్లాబ్ వేసుకున్నారు. వాటిని ఫోటోలు తీసి హౌసింగ్ అధికారులు తమ యాప్‌లో డౌన్‌లోడ్ చేసి ఆన్‌లైన్ చేస్తున్నారు. ప్రభుత్వ లాగిన్ ఇంకా ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. నిధులు విడుదల కాకపోవడంతో ప్రస్తుతం అనేక ఇళ్ల అసంపూర్తిగా ఉన్నాయి. అప్పోసప్పో చేసి పూర్తిగా నిర్మిస్తే లోన్ వస్తుందోలేదోననే భయం లబ్ధిదారుల్లో ఉంది. అధికారులు మాత్రం కొన్ని చోట్ల గోడలు కట్టకుండా మిగతా పనులు పూర్తి చేసుకోమని చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 1595 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం ఆన్‌లైన్ చేశారు. వారిలో చాలా మందికి శాంక్షన్ ఆర్డర్లు వచ్చాయి.ఇంకా కొన్ని ఆన్‌లైన్ చేయాల్సి ఉన్నట్టు సమాచారం. ఇక ప్రభుత్వం లాగిన్ ఇస్తే బిల్లులు కూడా పడతాయి. అనపర్తిలో 19, బిక్కవోలులో 51, చాగల్లులో 35, గోపాలపురంలో 56, కడియంలో 76, కోరుకొండలో 94, కొవ్వూరు అర్బన్‌లో 172, నిడదవోలు రూరల్‌లో 17, నిడదవోలు అర్బన్‌లో 120, పెరవలిలో 20, రాజమండ్రి అర్బన్‌లో 465, రాజమండ్రి రూరల్‌లో 96, రాజానగరంలో 139, రంగంపేటలో 87, సీతానగ రంలో 28, ఉండ్రాజవరంలో 97 ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయి. వీటిని పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వం ఇచ్చే సొమ్ము కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

అమ్మా..బాధపడకమ్మా!



దివాన్‌చెరువు గ్రామంలో శుక్రవారం నాలుగేళ్ల బాలుడు బోరుబావిలో పడి మృతిచెందిన ఘటన విదితమే.. దీంతో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ.. ఇటు కలెక్టర్ ప్రశాంతి కదిలారు.. బాలుడి తల్లిదండ్రులకు అండగా నిలిచారు.. ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు. అంతే కాకుండా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఇంటి స్థలం కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.. - వివరాలు 8లో

ఏపీ పేపర్‌మిల్లు లాకౌట్ ఎత్తివేత

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరంలోని ఏపీ పేపరుమిల్లు లాకౌట్‌ను ఎత్తివేసింది. మిల్లు కార్మిక నేతలతో శుక్రవారం రాత్రి మంత్రి దుర్గేష్, జిల్లా కలెక్టర్ ప్రశాంతి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణలు చర్చించిన సంగతి తెలిసిందే. అనంతరం మిల్లు వద్దకు చేరుకున్న కార్మికులు 11 కార్మిక సంఘాల నేతలు,కార్మికులతో చర్చించుకున్నారు. అయితే అప్పటికే మిల్లు యాజమాన్యం లాకౌట్ నోటీస్ జారి చేసింది. ఇందులో కొంత మందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు ప్రకటించింది. శనివారం కార్మిక నేతలతో జరిగిన సంప్రదింపుల అనంతరం వచ్చేవారంలో మంత్రి, ముఖ్యకార్యదర్శి, ప్రజా ప్రతినిధులు సమక్షంలో చర్చించి వేతన ఒప్పందం అమలుకు చర్యలు తీసుకునేలా కనిపించడంతో యాజమాన్యం లాకౌట్ ఎత్తివేసింది. కార్మికులపై విధించిన సస్పెండ్‌ను ఎత్తివేసింది.దీంతో శనివారం రాత్రి నుంచి 600 మంది పర్మినెంట్, 1600 మంది తాత్కాలిక కార్మికులు విధులకు వచ్చారు.



పోలీస్ టెక్నాలజీ బాగుంది!

జిల్లా పోలీసుల టెక్నాలజీ.. ఆయుధ సంపత్తిని చూసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆశ్చర్యపో యారు..వివిధ శాఖలతో ఎస్పీ నరసింహ కిషోర్ శనివారం నిర్వహించిన అర్థ సంవత్సర సమన్వయ సమావేశానికి ముఖ్యఅతిథిగా పీడీజే హాజరయ్యారు. పోలీసులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని సందర్శించారు. దీనిలో భాగంగా డ్రోన్ కెమెరాలను చూసి ఇవి ఎలా పనిచేస్తాయని అడిగి తెలుసుకున్నారు.. ఎస్పీ నరసింహ కిశోర్ ఆయుధ సంపత్తి, డ్రోన్ కెమెరాల పనితీరును వివరించారు.టెక్నాలజీ బాగుందంటూ కితాబిచ్చారు.



అ..సౌకర్యం!

రైల్వే అధికారులు చింతించండి

సదుపాయమంటూ..

రాజమండ్రి స్టేషను ఎన్‌ఎస్‌జీ-2 జాబితాలో ఉంది. డివిజన్‌లో ఆదాయంలో విజయవాడ తర్వాత ఈ స్టేషను ఉంటుంది. ప్రయాణికులకు సదుపాయాలు కల్పించడంలో భాగంగా 2023 ఆగస్టులో రైలు కోచ్ రెస్టారెంట్‌ని ఏర్పాటు చేశారు. అప్పటికే విజయవాడ తదితర స్టేషన్లలో ఈ కాన్సెప్ట్ మంచి ఫలితాలను ఇచ్చింది. వాడు కలోలేని ఒక రైలు కోచ్‌ని రైల్వే స్టేషను ప్రాంగణంలో ఏర్పాటు చేసి రెస్టారెంట్ మాదిరిగా మారుస్తారు. దీనిలో కూర్చుని తింటే రైలులో తిన్నట్టుగా అనుభూతి చెందాలనేది ప్రధాన ఉద్దేశం. రాజ మండ్రిలో కూడా అదే ఉద్దేశంతో ఏర్పాటు చేశారు. తొలి నుంచీ దీని నిర్వహణ మాత్రం సవ్యంగా లేదు. ఎప్పుడు తెరిచి ఉంటుందో స్థానిక అధికారులకు తెలియదు. ఈ రెస్టారెంట్ ఇక్కడే ఉంటే పుష్కరాల నాటికి పెద్ద సమస్యగా మారే అవకాశం లేకపోలేదు.

నో పార్కింగ్.. వాహనదారుల జేబుకు చిల్లు

ఈ కోచ్ రెస్టారెంట్ కారణంగా రైల్వే స్టేషను ఇరుకుగా మారిపోయింది.. వాహనదారులకు పార్కింగ్ సమస్య వచ్చిపడింది. ఎవరినైనా రైలు ఎక్కించడానికి బైక్‌పై వస్తే బైక్‌ఎక్కడ పార్క్ చేయాలో తెలియని పరిస్థితి.. నిమిషమైనా బైక్ పార్కింగ్ ఫీజు చెల్లించాల్సిందే. కోచ్ రెస్టారెంట్ చుట్టూ నో పార్కింగ్ బోర్డులే దర్శనమిస్తాయి. ఏ టీ తాగుతూనో అక్కడ వాహనం పార్క్ చేశామా ఆర్‌పీఎఫ్ పోలీసులు వచ్చి జరిమానా విధిస్తున్నారు. కాంట్రాక్టరు పార్కింగ్ ఫీజు కట్టకపోవడంతో ఈ సమస్య వచ్చిందని సమాచారం. వాహనదారులు మాత్రం కోచ్ రెస్టారెంట్ వస్తే వాహనాల పార్కింగ్ ఎక్కడనేది ప్రశ్న.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషనులోని రైలు కోచ్ రెస్టారెంట్ రైల్వేని బురిడీ కొట్టిస్తోంది. అసలు సదుపాయాన్ని పక్కనపెట్టి కొసరుతో గుత్తేదారు వ్యాపారం చక్కబెడుతుండగా.. అడ్డంగా మారిన సదుపాయం ప్రయాణికులకు అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ఇక్కడి నుంచి తర లించాలని.. ఇక్కడ అసలు అవసరమే లేదని వారు అభిప్రాయపడుతున్నారు. రైల్వే స్థలాన్ని గుత్తేదారు తెలివిగా ఉపయోగించుకుంటుంటే స్థానిక అధికారులకు ఆ చిత్రం కనబడడం లేదు.

అసలే ఇరుకు

ఈ రైల్వే స్టేషను ద్వారా రోజుకు 30 వేల మందికి పైగా రాకపోకలు సాగిస్తుంటారు. రద్దీ వేళల్లో వాహనాలు ఎక్కువగా వస్తుంటాయి. కోచ్ రెస్టారెంట్‌ని ప్రధాన ద్వారానికి సమీపంలో కీలకమైన ప్రదేశంలో పెట్టారు. దీంతో ఇక్కడ ప్రదేశం ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. అందువల్ల ఇక్కడి నుంచి ఖాళీ స్థలం ఎక్కువ ఉన్న తూర్పు స్టేషను వైపునకు దీనిని తరలించాలని ప్రయాణికులు కోరుతున్నారు.ఈ కోచ్ రెస్టారెంట్‌ని 24గంటలూ తెరిచి ఉంచే వెసులుబాటు ఉంది. దీంతో రాత్రి వేళల్లో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోంది.

కొసరుతో వ్యాపారం

ఈ కోచ్ రెస్టారెంట్‌ని విజయవాడకు చెందిన ఓ కంపెనీ దక్కించుకొంది. కానీ మేనేజర్ల పేరుతో సబ్-కాంట్రాక్టుకు ఇస్తోంది. సబ్ కాంట్రాక్టరు నుంచి రోజుకు రూ.15 వేల వరకూ.. అంటే నెలకు రూ.4.5 లక్షలు.. ఏడాదికి సుమారు రూ.55 లక్షలు వసూలు చేస్తోంది. ఈ ఆదాయం అలా ఉంటే.. కోచ్ రెస్టారెంట్‌ని ఆనుకొని కొంత ప్రదేశం ఉంది. ఆ ప్రదేశంలో టీ, జ్యూస్, రోజ్ మిల్క్ స్టాల్స్‌ని ఏర్పాటు చేశారు. వాటి నుంచి నెలకు రూ.3 లక్షలు..ఏడాదికి రూ.35 లక్షల వరకూ గుత్తేదారుకు ముడుతోంది. కోచ్ రెస్టారెంట్‌ని తెరవకపోతే ప్రయాణికులకు సదుపాయం ఉండకపోవచ్చు.. కానీ గుత్తేదారు మాత్రం కొసరులతో వ్యాపారం చేసేస్తున్నారు. అసలే అందవికారంగా ఉన్న రైలు కోచ్ రెస్టారెంట్‌ని తీసేసి స్టాల్స్‌ని ఏర్పాటు చేసినా రైల్వేకి ఏడాదికి రూ.కోటి వరకూ ఆదాయం సమకూరుతుంది.

ఇదే కారణమా..

కోచ్ రెస్టారెంట్ అస్తవ్యస్తంగా మారినా.. ఇష్టానుసారం నడిపిస్తున్నా అధికారులు పెద్దగా చర్యలు తీసుకోలేకపోతున్నారు. విజయవాడ రైల్వే డివిజన్ స్థాయిలో ఓ అధికారి అండ మెండుగా ఉండడంతో గుత్తేదారుపై ఎలాంటి చర్యలూ తీసుకోలేకపోతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ధరలను అధికంగా వసూలు చేస్తున్నారు. ధమ్ టీ అంటూ 70 ఎంఎల్ టీని రూ.15కి విక్రయిస్తూ ప్రయాణికులను దోపిడీ చేస్తున్నారు. రైలులో లేదా ప్లాట్‌ఫాంపై 120 ఎంఎల్ టీ రూ.10కే రైల్వే అందిస్తోంది.

- గుత్తేదారు గారడీ.. రైల్వే బురిడీ
- అసలు పడక.. కొసరుతో వ్యాపారం
- తెరవెనుక డివిజన్ స్థాయి అధికారి!
- రైల్వే శాఖ ఉద్దేశం నిర్వీర్యం
- అడ్డంగా మారిన సదుపాయం
- అస్తవ్యస్తంగా రైలు కోచ్ రెస్టారెంట్
- అదిరిపోతున్న ధరలు
- ప్రయాణికుల జేబులు గుల్ల

రోడ్డ దాటి నాలుగు అడుగులు వేస్తే రూ.100-200కే బిర్యానీ లభిస్తే ఈ రెస్టారెంట్‌లో రూ.350 వరకూ లాగేస్తున్నారు. టిఫిన్ విష యంలోనూ పరిస్థితి అలాగే ఉంది.డబ్బులకు తగిన పరిమాణం,నాణ్యత ఉండదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తొలగించడంపై దృష్టి సారించాలని ప్రయాణికులు సూచిస్తున్నారు.


బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

"వారంతా చదువుకుంటున్న విద్యార్థినులే. బాక్సింగ్‌పై ఆసక్తి వారిని రింగ్‌లోకి దిగేలా చేసింది. చదువును అశ్రద్ధ చేయకుండా అందులో రాణిస్తూనే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాల పంట పండిస్తున్నారు. జాతీయ స్థాయిలోనూ సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. అరకొర సౌకర్యాలతోనే వీరు చూపుతున్న ప్రతిభ క్రీడాభిమానుల ప్రశంసలు అందుకుంటోంది. తమను ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు పతకాలు తెచ్చిపెడతామని వారు చెప్పున్నారు."

చదువుల తల్లులు
పతకాల రాణులు

- బాక్సింగ్‌లో రాణిస్తున్న బాలికలు
- జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ
- జాతీయ స్థాయిలోనూ సత్తా చాటేందుకు ఆసక్తి
- ప్రోత్సహించి సౌకర్యాలు కల్పిస్తే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ప్రపంచవ్యాప్తంగా ఎందరో ఆసక్తి చూపే బాక్సింగ్‌పై ఇప్పుడు మన రాష్ట్రంలోనూ ఆసక్తి పెరుగుతోంది. ఒకప్పుడు మగవారే ఎక్కువగా పాల్గొనే ఈ క్రీడలో బాలికలు, యువతులు పాల్గొని సత్తా చాటుతున్నారు. కఠినతరమైన శిక్షణ పొందేందుకు వెనుకాడట్లేదు. చదువుకుంటూనే బాక్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుతున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. జాతీయ స్థాయిలోనూ పతకాలు కైవసం చేసుకోవడానికి వారు పడుతున్న తపన అందరినీ ఆకట్టుకుంటోంది.

కాకినాడ జిల్లా పిఠాపురం ప్రాంతానికి చెందిన పలువురు బాలికలు బాక్సింగ్‌లో శిక్షణ పొందేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. 10 నుంచి 20 సంవత్సరాల వయసు కలిగిన బాలికలు, యువతులు ఒకపక్క చదువుకుంటూ మరోపక్క బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. కనీస సౌకర్యాలు లేకున్నా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఆవరణలను, అక్కడ ఉన్న స్టేజీలపై తాత్కాలికంగా బాక్సింగ్ రింగ్‌లు ఏర్పాటుచేసి బాక్సింగ్ కోచ్ లక్ష్మణరావు వీరికి శిక్షణ ఇస్తున్నారు. ఎనిమిది సంవత్సరాల నుంచి 70 మంది బాలికలు, యువతులకు బాక్సింగ్‌లో శిక్షణ ఇస్తుండగా అందులో ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి. గత రెండు, మూడేళ్లల్లో 40 మందికి పైగా బాక్సర్లు జిల్లాస్థాయి పోటీల్లో, 30 మంది బాక్సర్లు రాష్ట్రస్థాయి పోటీల్లో, ఒక బాక్సర్ జాతీయ స్థాయి పోటీల్లో పాలుపంచుకున్నారు. జిల్లా స్థాయిలో పదుల సంఖ్యలో బాక్సర్లు పతకాలు సాధించారు. ఐదుగురు బాలికలు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు గెలుచుకున్నారు. బాక్సింగ్ రింగ్ ఏర్పాటుతో పాటు శిక్షణకు అవసరమైన కనీస సదుపాయాలు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పిఠాపురం బాక్సర్లు పతకాలు సాధిస్తారని కోచ్ లక్ష్మణరావుతో పాటు క్రీడాభిమానులు చెప్తున్నారు.


విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన కాకినాడ జిల్లా బాక్సర్లు

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం
జె.ఐశ్వర్య సూర్య దీపిక



ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జె.ఐశ్వర్య సూర్య దీపిక ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే తన లక్ష్యమంటోంది. హర్యానాలోని రోహ్‌తక్‌లో జరిగిన నేషనల్ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రతిభ చాటింది. త్రుటిలో పతకం చేజార్చుకుంది. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. విశాఖలో ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో జరిగిన రాష్ట్ర స్థాయి యూత్, జూనియర్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొని రజత పతకాలు గెల్చుకుంది. కాకినాడ, పిఠాపురం, సామర్లకోటల్లో జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ జిల్లా పోటీల్లో స్వర్ణ పతకాలు కైవసం చేసుకుంది. మెరుగైన శిక్షణ ఇస్తే జాతీయ స్థాయిలో పతకాలు సాధించడంతో పాటు అంతర్జాతీయ పోటీల్లోనూ సత్తా చూపుతానని సూర్యదీపిక ధీమాగా చెప్తోంది.

మంచి ఉద్యోగం సాధనే లక్ష్యం
కాకాడ హర్షిణి



విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన పిఠాపురం పట్టణానికి చెందిన కాకాడ హర్షిణి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం, మంచి ఉద్యోగం సాధించడం తన లక్ష్యమని చెప్తోంది. కాకినాడ, సామర్లకోట, పిఠాపురంల్లో జరిగిన ఉమ్మడి జిల్లా, కాకినాడ జిల్లా బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించింది.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్న మహాలక్ష్మి



రాష్ట్ర స్థాయి పోటీల్లో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన బాక్సర్లు రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారు. పిఠాపురం పట్టణానికి పి.మహాలక్ష్మి ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతోంది. చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి ఉన్న ఈమె బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుని కాకినాడ, పిఠాపురంల్లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించింది. విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాక్సింగ్ పోటీల్లో రజత పతకం గెలుపొందింది. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి రాష్ట్రానికి తద్వారా పిఠాపురానికి పేరు తీసుకురావాలన్నదే తన లక్ష్యమని చెప్పింది.

వైద్యురాలై సేవలందిస్తా
కాకాడ హరిణి



బాక్సింగ్‌లో జాతీయ స్థాయిలో సత్తా చాటుతూ వైద్యురాలిగా స్థిరపడి పేదలకు వైద్య సేవలు అందిస్తానంటోంది పిఠాపురానికి చెందిన కాకాడ హరిణి. ఈమె ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసింది. ఈమె సోదరి హర్షిణి కూడా బాక్సర్. ఉమ్మడి జిల్లా, కాకినాడ జిల్లా బాక్సింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ అండర్-19 బాక్సింగ్ ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంది.

భయాన్ని అధిగమించి పతకాలు సాధిస్తున్న వైష్ణవి



బాక్సింగ్ అంటే ఉన్న భయం, తల్లిదండ్రుల్లో ఉన్న సందేహాలను పటాపంచలు చేస్తూ బాక్సింగ్‌లో శిక్షణ పొందడమే కాదు పలు పతకాలు సాధించింది పిఠాపురం మండలం మల్లాం గ్రామానికి చెందిన అడబాల వైష్ణవి. ఈమె ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతోంది. ఉమ్మడి, కాకినాడ జిల్లా స్థాయిల్లో జరిగిన పోటీల్లో స్వర్ణ పతకాలు, విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి యూత్ ఉమెన్ బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం కైవసం చేసుకుంది. 'ఒకసారి నా బాక్సింగ్ ప్రయాణం చూసుకుంటే నాకే ఆశ్చర్యంగా అనిపిస్తోంది. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమ'ని వైష్ణవి చెప్తోంది.

సదుపాయాలు కల్పిస్తే జాతీయ స్థాయిలోనూ పతకాలు: లక్ష్మణరావు, బాక్సింగ్ కోచ్



బాక్సింగ్ శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన మౌలిక వసతులు లేకున్నా ఉన్న సౌకర్యాలనే వినియోగించుకుని ఎనిమిది సంవత్సరాలుగా శిక్షణ ఇస్తున్నాను. వీరు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు ఉన్న నగరాలు నుంచి వచ్చిన వారిని దీటుగా ఎదుర్కొని పతకాలు సాధిస్తున్నారు. బాలురు కంటే అధికంగా బాలికలే బాక్సింగ్‌లో శిక్షణ పొందేందుకు ముందుకు వస్తున్నారు. బాక్సింగ్‌కు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తే మన బాక్సర్లు జాతీయ స్థాయిలో సత్తా చూపి పతకాలు సాధించడం ఖాయం. ఈ దిశగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవాలని క్రీడాభిమానులు కోరుకుంటున్నారు.


ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

హామీలు అమలు చేయకపోతే ఉద్యమం

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

కాకినాడ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గత సాధారణ ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు ఆర్థికపరమైన అంశాలపై ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను దసరాలోపు అమలు చేయకపోతే ఉద్యమం చేపడతామని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఎస్టీయూ కాకినాడ జిల్లా కార్యాలయంలో శనివారం రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ 11వ పీఆర్సీ బకాయిలు, 2024, 2025 జూలై నాటికి నాలుగు డీఏలు పెండింగులో ఉన్నాయన్నారు. గతంలో ప్రకటించిన మూడు డీఏల ఎరియర్స్ 2021లో ఓపీఎస్ వారికి పీఎఫ్ బకాయిలు చెల్లించారు కానీ సీపీఎస్ వారికి చెల్లించలేదన్నారు.

రఘునాథ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఎక్కువయ్యాయన్నారు. తిరోగమన విధానాలతో విద్యా ప్రమాణాలు మెరుగుపడవన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, రాజు, శివప్రసాద్, రామచంద్రయ్య, శ్రీనివాస్, కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగ అభివృద్ధిలో ముందడుగు
కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 12 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రసిద్ధిగాంచిన ఉప్పాడ చేనేత రంగ అభివృద్ధికి, చేనేత కార్మికుల జీవనోపాధి మరింత మెరుగుపర్చేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలు ఫలించాయని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడతో పాటు అనేక గ్రామాల్లో చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను ఆదుకునేందుకు నేషనల్ హ్యాండ్లూమ్ డవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా నిధులు మంజూరు చేయాలని గత కొన్ని నెలలుగా కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నామన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా గతంలో కేంద్రానికి లేఖ రాసిందని గుర్తు చేశారు. ఈ పథకం అమలైతే రూ.15 కోట్లు మంజూరవుతాయన్నారు.

ఈ నిధులతో ఉప్పాడలో చేనేత రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా అభివృద్ధి చేయడంతో పాటు 700 మంది చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించగలమన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న వీవర్స్ సర్వీస్ సెంటర్, జోనల్ డైరెక్టర్ నేతృత్వంలో సాంకేతిక కమిటీ ఉప్పాడలో పర్యటిస్తుందని ఎంపీ చెప్పారు.


జీవనరేఖలు కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

24 కథల సమాహారమే 'జీవనరేఖలు'

- గ్రంథావిష్కరణ సభలో వక్తలు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ గాంధీభవన్‌లో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన ఇంద్రగంటి నరసింహమూర్తి రచించిన 'జీవనరేఖలు' కథా సంపుటి పరిచయ సభ శనివారం సాయంత్రం జరిగింది. డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షత వహించగా గనారా గ్రంథావిష్కరణ చేశారు. సాహితీ స్రవంతి నగర అధ్యక్షుడు మార్ని జానకిరామచౌదరి అతిథులను ఆహ్వానించారు. వక్తలుగా పి.పద్మజవాణి, ఎన్‌వీఎస్ ఇందిర హాజరయ్యారు. డాక్టర్ జోస్యుల కృష్ణబాబు మాట్లాడుతూ ఇంద్రగంటి నరసింహమూర్తి సమకాలీన సామాజిక అంశాలపై కథలు రాస్తూ మానవసంబంధాలను, భావోద్వేగాలను చక్కగా పండిస్తారన్నారు. పి.పద్మజవాణి సమీక్షిస్తూ మానవతా విలువలను తట్టిలేపే సంస్కారం, ఆశావహ దృక్పథం కలిగిన 24 కథల సమాహారమే ఈ జీవనరేఖలు అని ప్రశంసించారు. ఇందిర మాట్లాడుతూ మధ్య తరగతి మధురహాసాలకు, ఆరోగ్యకరమైన హాస్యానికి నిలువెత్తు సంతకాలు ఇంద్రగంటి కథలు అన్నారు. అనంతరం జానకిరామచౌదరి అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. గరికపాటి మాస్టారు, డాక్టర్ శైలజ, శుభశ్రీ, అద్దేపల్లి జ్యోతి, సావిత్రీప్రసాద్, మాకినీడి సూర్యభాస్కర్, అద్దేపల్లి ప్రభు, అవధానుల మణిబాబు, సాయి సత్యనారాయణ, సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, చింతపల్లి సుబ్బారావు, మద్దాలి సత్యనారాయణ, ప్రభాకరవర్మ, పెండ్యాల కామేశ్వరరావు, శిరీష, పి.రామస్వామి, పెద్దింశెట్టి రామకృష్ణ, మోహనరావు, రవిచంద్ర, వెంకటనారాయణ తదితర సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఉధృతంగా గోదావరి

- ఎగువున తగ్గుముఖం
- ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 5,29,209 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి
- మరింత పెరగనున్న ఉధృతి


ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తూ సముద్రంవైపు ప్రవహిస్తోంది. ఇదే సమయంలో ఎగువున ఉధృతి తగ్గుముఖం పడుతోంది. శుక్రవారం సాయంత్రానికి ధవళేశ్వరం వద్ద 3.5లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి కలవగా శనివారం సాయంత్రానికి 5,29,209 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా సముద్రంలోకి ప్రవహిస్తోంది. దీంతో బ్యారేజీ దిగువన ఉన్న లంకలో ఇసుక మైదానం పూర్తిగా వరద ప్రవాహంతో నిండిపోయింది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.60 అడుగులకు చేరుకుంది. ఆదివారం నాటికి నీటిమట్టం మరింత పెరిగి సుమారు 7లక్షల క్యూసెక్కులకు పైగా ఎగువ నుంచి రావచ్చని ఫ్లడ్ సెక్షన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఆయా అధికారులకు కేటాయించిన పరిధిలో ఫ్లడ్ డ్యూటీల్లో అప్రమత్తంగా ఉన్నారు. కాగా ఎగువన భద్రాచలం వద్ద 41.40 అడుగులకు పెరిగిన నీటిమట్టం ఆపై నిలకడగా కొనసాగి తగ్గుముఖం పట్టింది. శనివారం మధ్యాహ్నం 4 గంటలకు ఒక పాయింట్ తగ్గి 41.30 అడుగులకు చేరుకుంది.

ఎగువ నీటిమట్టాలు ఇవే

ఎగువన అన్ని ప్రాంతాల్లో వరద ఉధృతి నెమ్మదించింది. దీంతో వరద నీటిమట్టం తగ్గుదల నమోదైంది. శనివారం మధ్యాహ్నం 4గంటలకు కాళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 9.27 మీటర్లుగా నమోదు కాగా, పేరూరు వద్ద 14.35 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 11.60 మీటర్లు, భద్రాచలం వద్ద 41.30 అడుగులు, కూనవరం వద్ద 16.02 మీటర్లు, కుంట వద్ద 7.05 మీటర్లు, పోలవరం వద్ద 10.68 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 14.68 మీటర్లుగా నీటిమట్టం నమోదైంది.

ప్రమాద హెచ్చరికలు..

కాటన్ బ్యారేజ్ 175గేట్లు పూర్తిగా ఎత్తివేసిన స్థితిలో 10లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు దిగువకు ప్రవహించడంతో పాటు గోదావరి నీటిమట్టం 11.75 అడుగులకు చేరుకుంటే మొదటి ప్రమాదహెచ్చరిక జారీ చేస్తారు. ఆపై 13లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తున్న సమయంలో నీటిమట్టం 13.75 అడుగులకు చేరుకుంటే రెండో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. 18 నుంచి 19లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తున్న సమయంలో నీటిమట్టం 17.50 అడుగులకు చేరుకుంటే చివరి ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది.

రోడ్డుపైకి వరద.. నిలిచిన రాకపోకలు

వీఆర్ పురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతరేవుపల్లి, కన్నాయిగూడెం ప్రధాన రహదారిపైకి వరదనీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఐటీడీఏ పీవో అపూర్వభరత్ వరద నీరు చేరిన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ పోలీసులను కాపలా ఉంచారు. అన్నవరం చప్టాకు ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. పెద్దమట్టపల్లిలోని ఆరోగ్య ఉపకేంద్రంలో తగినన్ని మందులు అందబాటులో ఉంచాలని, డాక్టర్‌ను ఉంచాలని డీఎంఅండ్‌హెచ్‌వో వల్లయ్యకు ఆదేశాలిచ్చారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాలకృష్ణారెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

వరద తీవ్రత తగ్గుముఖం!

చింతూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వరద తీవ్రత తగ్గనున్నట్లు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ పేర్కొన్నారు. శనివారం పీవో కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. సీడబ్ల్యూసీ సమాచారం మేరకు శనివారం రాత్రి 7 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 41అడుగులకు చేరుకుందన్నారు.అర్ధరాత్రి నుంచి క్రమంగా తగ్గనున్నట్లు సీడబ్ల్యూసీ అంచనా వేసిందన్నారు. దీంతో ఈ వారంలో వరద ముప్పు లేనట్లేనన్నారు. కాగా గోదావరి ఎగపోటుతో శబరి నది క్రమంగా పెరిగి తదుపరి వరద తీవ్రత తగ్గనుందన్నారు. అయినప్పటికీ లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గండిపోశమ్మ గోపురానికి వరద నీరు

దేవీపట్నం, జూలై 12(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా గోదావరి ఉధృతంగా పెరగడంతో మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం చుట్టూ వరదనీరు చేరి శనివారం నాటికి గోపురాన్ని తాకింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శబరి, కిన్నెరసాని తదితర నదులు పొంగి ప్రవహించడంతో గోదావరి పరీవాహక ప్రాంతాలకు వరదనీరు చేరింది. అమ్మవారి ఆలయం వద్ద దేవస్థాన అధికారుల కార్యాలయం, నిర్మాణాలు, భక్తుల కోసం నిర్మించిన షెడ్లు మునిగిపోయాయి. గోదావరిలోకి ఎవరినీ వెళ్లనీయకుండా శనివారం ఎస్ఐ షరీఫ్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

ఏపీ ట్రాన్స్‌కో క్రికెట్ జట్టు కెప్టెన్‌గా శ్రీరామకృష్ణ



కడియం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌కో, జెన్‌కో డిస్కం క్రికెట్ జట్టు కెప్టెన్‌గా తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం దుళ్ల లైన్‌మెన్ అడబాల శ్రీరామకృష్ణ ఎంపికయ్యారు. ఈ మేరకు ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఉత్తర్వులు ఇచ్చింది. 20 మందిని జట్టుకు ఎంపిక చేయగా కెప్టెన్‌గా అడబాల శ్రీరామకృష్ణ, వైస్ కెప్టెన్‌గా విశాఖపట్నానికి చెందిన టి.అభిషేక్‌లను నియమించారు. కాగా శ్రీరామకృష్ణ స్వస్థలం చెముడులంక-గాంధీనగరం. చిన్నతనం నుంచే క్రికెట్‌లో రాణించేవాడు. లైన్‌మెన్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ మరోపక్క క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. బౌలింగ్, బ్యాటింగ్‌ల్లో ప్రతిభ కనబరుస్తున్నాడు.

15 నుంచి తత్కాల్‌కి ఆధార్ ఓటీపీ కచ్చితం

- అవతవకలకు చెక్ పెట్టే దిశగా రైల్వే
- ఇప్పటికే ఆన్‌లైన్ టికెట్లకు అమలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తత్కాల్ టికెట్లలో జరుగుతున్న అవకతవకలను అడ్డుకట్ట వేసే దిశగా రైల్వే ఈ నెల 15 నుంచి ఆధార్‌ని కచ్చితం చేసింది. ఇప్పటికే ఈ విధానం ఆన్‌లైన్ టికెట్ల విషయంలో అమలవుతోంది. ఇప్పుడు కౌంటర్ల వద్ద తీసుకొనే టికెట్లకు కూడా అమలు చేయనున్నారు. టికెట్ తీసుకునే వారు తమ ఫోన్‌తో లింక్ అయిన ఆధార్ నెంబరును రిజర్వేషను దరఖాస్తులో రాయాల్సి ఉంటుంది. టికెట్ ఇచ్చే సమయంలో ఆ నెంబరుకు ఓటీపీ వస్తుంది. దానిని కంప్యూటర్‌లో నమోదు చేస్తేనే టికెట్ బుక్ అవుతుంది. ఇప్పటికే ఆ విధంగా రైల్వే సాఫ్ట్‌వేర్‌ని అప్‌డేట్ చేశారు. ఆధార్ నెంబరుతో లింక్ అయిన మొబైల్ నెంబరు మాత్రమే దరఖాస్తులో నింపాల్సి ఉంటుంది. టికెట్ తీసుకున్న వాళ్లు ప్రయాణం చేయకపోయినా.. సదరు టికెట్ ద్వారా ప్రయాణం చేసే వారి సమాచారం టికెట్ తీసుకున్న వారికి కచ్చితంగా తెలియాల్సి ఉంటుంది. అత్యవసర సమయంలో ఆ నెంబరుకే రైల్వే సమాచారం ఇస్తుంది. కాగా.. ప్రస్తుతం తత్కాల్ టికెట్ బుకింగ్ ఓపెన్ అయిన సెకన్లలోనే కోటా ముగిసిపోతోంది. ఒక్క నిమిషం దాటితే వెయిటింగ్ లిస్టులోకి వెళ్లిపోతోంది. గోదావరి, గౌతమి వంటి రైళ్లకు అయితే తత్కాల్ ఓపెన్ అయిన వెంటనే మొదటి టికెట్ దొరికితే అదృష్టమేనని చెప్పవచ్చు. తాత్కాల్ టికెట్లను అత్యవసర, తప్పనిసరి సమయంలో మాత్రమే అధిక శాతం జనం బుక్ చేసుకుంటారు. అందువల్ల వెయిటింగ్ లిస్టు టికెట్లు కన్‌ఫర్మ్ కావడం దాదాపుగా కష్టమనే చెప్పవచ్చు. ఇప్పుడు ఓటీపీ విధానం వల్ల కొద్ది సెకన్లు ఆలస్యం తప్పదు. ఒకవేళ ఆధార్ లింక్‌డ్ మొబైల్‌కి సాంకేతిక, నెట్‌స్లో వల్ల ఓటీపీ రాకపోతే సమయం వృథా.. టికెట్ దొరకని వ్యథ తప్పకపోవచ్చు. అయితే తత్కాల్ టికెట్లు అవసరమైన ప్రయాణికులకు దక్కడం లేదనే ఫిర్యాదులున్నాయి. ఈ టికెట్లు తీసుకోవడం కూడా ఓ అనధికారిక వ్యాపారంగా మారిపోయింది. దీనికి ఏజెంట్లు పుట్టుకొచ్చారు. టికెట్‌పై కొంత మొత్తం అదనంగా తీసుకొని తత్కాల్ లైనులో ఎవరో ఒకరు నించొని టికెట్ తీసుకుంటున్నారు. తత్కాల్ టికెట్ అప్లికేషన్లలో ఏదో ఒక పేరు నింపేసి కౌంటరు వద్ద సీరియల్ నెంబర్లు వేసి లైనులో పెడుతున్నారు. దీంతో తత్కాల్ టికెట్ అవసరమైన వాళ్లు ఆ ఏజెంట్లను ఆశ్రయించక తప్పడం లేదు. వీటన్నిటికీ చెక్ పెట్టే దిశగా ఆధార్ ఓటీపీని రైల్వే అమల్లోకి తీసుకొస్తోంది.

సమన్వయంతో సమస్యల పరిష్కారం
పీడీజే గంధం సునీత



రాజమహేంద్రవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో వివిధ శాఖల అధికారులతో ఎస్పీ నరసింహ కిషోర్ అర్ధ సంవత్సర సమన్వయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పీడీజే విచ్చేశారు. పోలీసులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని సందర్శించారు. పోలీసులు ఉపయోగించే డ్రోన్లు తదితర సరంజామా గురించి ఆమెకు ఎస్పీ వివరించారు. అనంతరం సమావేశంలో ఆమె మాట్లాడుతూ దర్యాప్తులు, విచారణ తదితర అంశాల్లో జరుగుతున్న పొరబాట్లు, సరిదిద్దుకునే విధానం వంటివి ప్రధాన న్యాయమూర్తి వివరించారు. పోలీసులు నిత్యం విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అర్ధ సంవత్సర నేర సమీక్షను ఎస్పీ నిర్వహించారు. కేసుల దర్యాప్తుల్లో ప్రతిభ కనబరిచిన అధికారులను సత్కరించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి, పోలీసు, రెవెన్యూ, న్యాయ, వైద్య, మునిసిపల్, ఫోరెన్సిక్, ఆర్అండ్‌బీ, పీఆర్, ఆర్టీఏ, ఎన్‌హెచ్, ఎక్సైజ్, జైళ్లు, రైల్వే, విద్య, ఆర్టీసీ, విపత్తు నిర్వహణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంటబోదె నుంచి ఎగజిమ్ముతున్న గ్యాస్

కాట్రేనికోన, జూలై 12(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం మొల్లి పొరలో పంటబోదె నుంచి గ్యాస్ ఎగజిమ్ముతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని సర్పంచ్ గంటి వెంకట సుధాకర్‌కు స్థానికులు తెలిపారు. వెంటనే ఆయన ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపారు. దీనివల్ల ఎటువంటి ఇబ్బందులేదని ఓఎన్‌జీసీ సిబ్బంది వివరించారు. గురువుపదిలో పరిస్థితిని చక్కదిద్దుతున్నారు. ఎస్ఐ అవినాష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రైతులు తవ్వకున్న బోర్ల నుంచి వాటర్ ఫ్లోటింగ్ మూలంగా శబ్దాలు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా అరెస్టు

అమలాపురంటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అమలాపురం గొల్లగూడెంలో ఓ గృహంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు సమాచారంతో పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేశారు. అయినవిల్లి మండలం ముక్తేశ్వరం గ్రామానికి చెందిన జ్యోతి, అమలాపురం మండలం ఎ.వేమవరానికి చెందిన దుర్గారావు, రాజమహేంద్రవరానికి చెందిన లక్ష్మి, విజయనగరం జిల్లాకు చెందిన జయరాజులను అరెస్టు చేశారు. ఇద్దరు యువతులను, ఇద్దరు విటులను పట్టుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు శనివారం తెలిపారు. రూ.వెయ్యి నగదుతోపాటు కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.



వాడపల్లిలో వెంకన్న ఆలయంలోని క్యూలైన్లలో స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి భక్తుల నిరీక్షణ

గోవిందా.. హరి గోవిందా

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- ఏడు గంటల పాటు క్యూలైన్లలో భక్తులు
- లొల్ల లాకుల వద్ద స్తంభించిన ట్రాఫిక్
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.74.02 లక్షలు

ఆత్రేయపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆషాడ మాసం రెండవ శనివారం సెలవురోజు కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో వాడపల్లి కిక్కిరిసింది. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పలపుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తలనీలాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. స్వామివారిని 70వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.74.02 లక్షలు లభించినట్లు ఉపకమీషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఏడుగంటల పాటు క్యూలైన్లలో భక్తుల ఇక్కట్లు

రెండో శనివారం సెలవురోజు కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి అధికంగా మంది భక్తులు స్వామివారి క్షేత్రానికి తరలివచ్చారు. ఏడుగంట లపాటు క్యూలైన్లలో స్వామివారి దర్శనం కోసం వేచి ఉండి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రూ.200 విశిష్ట దర్శనం సుమారు ఏడు గంటలపాటు క్యూలైన్లలో వేచియున్నారు. రూ.1116 వేదాశీర్వచనం, భక్తులు మూడు గంటల పాటు క్యూలైన్లలో వేచియుండి స్వామివారిని దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు క్యూలైన్లలో వేచి ఉండలేక ఇబ్బందులు ఎదుర్కొని స్పృహకోల్పోయారు. పార్కింగ్ ప్రదేశం నుంచి కనకదుర్గమ్మ ఆలయం చెక్‌పోస్టు వరకూ వాహనాలు బారులుతీరి ట్రాఫిక్ స్తంభించింది. ఎక్కడికక్కడే అక్కడ వాహనాలు నిలుపుదల చేశారు. దర్శనం కోసం గంటల తరబడి ఉన్న భక్తులు మరో పక్క ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొన్నారు.

మహిళా వైద్య సిబ్బంది భద్రత గాలికి..

- రంగరాయ బోధనాసుపత్రిలో ఇంత నిర్లక్ష్యమా
- నిందితులలో ఓ వ్యక్తికి వైసీపీ నాయకుడి అండ

జీజీహెచ్(కాకినాడ) జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఒకేషనల్, బీఎస్సీ ఎంఎల్‌టీ విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురికావడం సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై లోతైన విచారణ జరుగుతోంది. ఈ క్రమంలో విద్యార్థినుల భద్రతకు సంబంధించిన అంశాలపై చర్చ జరుగుతోంది. విద్యార్థినులు విధులు నిర్వర్తించే వివిధ వార్డులు, ల్యాబొరేటరీలు, పార్కుల్లో ఎటువంటి సీసీ కెమెరాల పర్యవేక్షణ లేదు. దీంతో ఎక్కడ ఏది జరిగినా ఏది స్థానాల్లో పాతుకుపోయి రెగ్యులర్ ఉద్యోగులమంటూ చలామణి అవుతున్న వారి ఆగడాలకు అడ్డుఅదుపు లేకుండాపోతోంది. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఇటువంటి ఘటనలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు వినిపిస్తోంది. బోధనాసుపత్రిలో ఇంత దారుణాలు జరుగుతున్నా జీజీహెచ్ సూపరింటెండెంట్ స్పందించకపోవడం విమర్శలకు దారితీసింది. ప్రతిపక్ష వైసీపీకి చెందిన ఒక సర్పంచ్, మాజీ ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడి ఆశీర్వాదంతోనే అతని సొంత మేనల్లుడైన బీజమ్మిరాజు జీజీహెచ్‌లో చక్రంతిప్పేవాడని, ఇప్పుడు లైంగిక ఆరోపణల కేసులో ఇతడే ప్రధాన నిందితుడిగా ఉన్నాడని చెబుతున్నారు. తనకు రాజకీయ పలుకుబడి ఉందనే తెగింపుతో ఇష్టారాజ్యంగా జిమ్మిరాజు వ్యవహరించేవాడని పలువురు అంటున్నారు. విచారణాధికారి ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ సభ్యులకు అందుకే నిర్లక్ష్యంగా సమాధానాలు ఇచ్చాడంటున్నారు. ఇప్పుడు నిందితులను తప్పించేందుకు ఈ వైసీపీ నాయకుడు చేస్తున్న ప్రయత్నాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శనేశ్వరస్వామిని దర్శించుకున్న
తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పూజలు

- స్వామివారి ఆదాయం రూ.2.15లక్షలు


స్వామిని దర్శించుకున్న తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ దంపతులు

కొత్తపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనముకు తైలాభిషేకాలకు క్యూకట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనేశ్వరస్వామి ఆలయంలో తెలంగాణ అడిషనల్ డీజీపీ, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ దంపతులు శనేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. వివిధసేవల ద్వారా స్వామివారికి రూ.2,15, 023 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో సురేష్‌బాబు తెలిపారు.

సత్యదేవుడికి వెండి పళ్లెం బహూకరణ


వెండిపళ్లెం బహూకరిస్తున్న దాత రఘుమోహన్ గుప్తా

అన్నవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి నిత్య కైంకర్యాలకు వినియోగించేందుకు శనివారం ఒక భక్తుడు వెండిపళ్లెం బహూకరించారు. హైదరాబాద్‌కు చెందిన రఘుమోహన్‌గుప్తా బీటీని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించారు. 820 గ్రాముల బరువు కలిగిన వెండి పళ్లెం విలువ రూ.92వేలు అని దేవస్థానం అకౌంట్ విభాగ అధికారులు తెలిపారు.

సత్యదేవ నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం కొంతమూరుకు చెందిన నడిమింటి నూకరాజు రూ.1,01,116లు విరాళంగా సమర్పించారు.

జీఎస్‌టీ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ పూజలు

సత్యదేవుని సన్నిధిలో శనివారం జీఎస్‌టీ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ హరేరామ్ స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో మనస్ఫూర్తిగా పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఈవో ఆయనకు స్వామివారి ప్రసాదం అందించారు.


జీఎస్టీ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌కు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈవో సుబ్బారావు

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం


అమలాపురంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాబి

అమలాపురంటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పుల్లెగొల్ల జగ్గారావు, కొల్లూరు సత్యనారాయణమూర్తి కళ్యాణ మండపంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకటబ్బా(బాబి) తెలిపారు. ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభిస్తారు. మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌లు వివిధ విభాగాలను ప్రారంభిస్తారని తెలిపారు. మెగా వైద్య శిబిరం ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు తా సద్వినియోగం చేసుకోవాలని బాబి కోరారు. సమావేశంలో మెడికల్ కమిటీ చైర్మన్ పచ్చిపులుసు కృష్ణారావు, ఉపాధ్యక్షుడు వరదా నూరిబాబు, నంబూరి సత్యనారాయణమూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సింగంశెట్టి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలు పట్టించాయ్!

- లంకల్లో 160 లీటర్ల సారా స్వాధీనం
- ఐదుగురి అరెస్టు.. ఇద్దరు పరారీ: ఎక్సైజ్ సీఐ హనుశ్రీ


పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

రాజమహేంద్రవరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): నాటుసారా, అక్రమ మద్యం తయారీపై ప్రత్యేక నిఘా పెట్టామని.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేదిలేదని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ పేర్కొన్నారు. గోదావరిలంకల్లో శనివారం సోదాలుచేసి నాటుసారా, బెల్లంఊటలు స్వాధీనం చేసుకొని రెండు కేసుల్లో నలుగురిని అరెస్టు చేశామన్నారు. ఈ మేరకు వివరాలను వెల్లడించారు. గోంగూరలంక, పూటింగ్ లంక, బ్రిడ్జిలంకల్లో డ్రోన్‌లను ఉపయోగించి విస్తృతంగా తనిఖీలు చేశామన్నారు. సారా తయారీ స్థావరాలను గుర్తించామన్నారు. 3400లీటర్ల బెల్లపు ఊట, 160లీటర్ల సారా, ఒక పడవ, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. తాడితోటకు చెందిన బందారు దుర్గా ప్రసాద్, వనం వెంకటేశ్, వెంకటనగరానికి చెందిన గంగోతు బంగారు, ద్వారపూడికి చెందిన అయినవిల్లి స్వామిసాగర్, కటీటం గాల పేటకు చెందిన తెంగాశెట్టి శ్రీనివాసును అరెస్టుచేసి కోర్టు ఆదేశాలతో రిమాండుకు తరలించమన్నారు. ప్రధాన నిందితులైన సంజీవ్‌నగర్‌కి చెందిన బుడ్డిగ దేవుడు, వెంటకనగరానికి చెందిన కంగోతు వెంకన్నబాబులు పరారీలో ఉన్నారని.. ప్రత్యేక బృందంతో గాలిస్తున్నామన్నారు. వారి సమాచారం తెలిస్తే తమకు చెప్పాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని హనుశ్రీ పేర్కొన్నారు. ఆగాలో నాటుసారా, అక్రమ మద్యం తయారీ, నిల్వ, విక్రయంపై ఎలాంటి సమాచారం తెలిసినా తమకు తెలియజేయడం బాధ్యతగా భావించాలని కోరారు. సోదాల్లో ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అమెజాన్‌కు ప్రగతి విద్యార్థుల ఎంపిక

గండేపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థినులు గ్లోబల్ టెక్ దిగ్గజం అమెజాన్ సంస్థలో 30లక్షల వార్షిక వేతనంతో ఫుల్‌టైమ్ ఉద్యోగ అవకాశాలను సాధించారని కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11మంది (2025లో ఉత్తీర్ణులైన) విద్యార్థులు అమెజాన్‌లో ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌కు 50వేల నుంచి 70వేల మధ్య శిక్షణ వేతనంతో ఎంపికై ఆ సమయంలో వారు సీనియర్ ఇంజనీర్లతో పోటీగా పనిచేస్తూ వారి నైపుణ్యాలను ప్రదర్శిస్తూ వారిలో ఎనిమిదిమంది ఫుల్‌టైమ్ ఉద్యోగులుగా మారారని తెలిపారు. నేటి విద్యా సమాజానికి గర్వకారణంగా నిలిచే విధంగా ఉద్యోగ నియామక అవకాశాల సాధనతో తమ కళాశాల విద్యార్థులు ఎప్పుడూ ముందంజలో ఉంటారన్నారు. కళాశాల నిర్వహించే ప్రోగ్రామింగ్, సాంకేతిక నైపుణ్యాల శిక్షణ, కోడింగ్, హాకథాన్, గ్లోబల్ సర్టిఫికేషన్ కోర్సుల ద్వారా పొందిన నిర్మాణాత్మక శిక్షణ కార్యక్రమాలు దోహదపడ్డాయన్నారు. ఉభయగోదావరిజిల్లాలోని పెనుగుదురు, బొమ్మూరు, జగ్గంపేట, కరకుదురు, గొల్లలమామిడాడకు చెందిన ఆర్.శ్రీసత్యశ్రీ, ఇకోమలా, జీమేఘనా, డి.అదితి, పి.మధు, వైరేప్పాచౌదరి, నీహార్ సత్యశ్రీ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు.

మద్యానికి బానిసై ...

అమ్మమ్మను చంపేశాడు

- పీక నులిమి హత్యచేసిన మనవడు
- మద్యానికి డబ్బుల కోసం వేధింపులు
- తప్పించుకున్న తల్లి, బలైన అమ్మమ్మ


వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తొండంగి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన మనవడు డబ్బులకోసం వేధించి అమ్మమ్మ పీక నులిమి చంపిన కిరాతక ఘటన ఆదివారం ఉదయం కోటనందూరు తొండంగి మండలం దానవాయిపేట పంచాయతీ నర్సిపేట గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఉప్పాడ కొత్తపల్లి మండలం అమీనాబాద్‌కు చెందిన బెజుగు దీనమ్మ (92) తన పెద్ద కుతురు గోసల పద్మ వద్ద నర్సిపేట గ్రామంలో ఉంటోంది. పద్మ కుమారుడు జాన్ (35) మద్యానికి బానిసై తరచూ తల్లిని, భార్యను వేధింపులకు గురి చేస్తుండడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో జాన్ తన తల్లి వద్ద ఉంటున్నాడు. పోలియో వ్యాధిగ్రస్తుడైన జాన్ మద్యానికి బానిసై డబ్బుల కోసం నిత్యం తల్లిదండ్రులను వేధింపులకు గురిచేస్తుండేవాడు. తాజాగా శనివారం తల్లి పద్మ పనిచేస్తున్న హేచరీ వద్దకు వెళ్లి డబ్బులకోసం వేధించడంతో 500 రూపాయలు ఇవ్వగా దాంతో మద్యం సేవించాడు. తిరిగి సాయంత్రం పద్మ ఇంటికి రాగా అమెపై దాడిచేసి అమెవద్ద ఉన్న కొంత మొత్తాన్ని కూడా లాక్కుని బూతులు తిడుతూ బీభత్సం సృష్టించడంతో ఆమె వేరే ఇంటికివెళ్లి తలదాచుకుంది. ఈ నేపథ్యంలో అతని దృష్టి ఇంట్లో ఉన్న వృద్ధురాలైన అమ్మమ్మ దీనమ్మపై పడింది. ఆమెకు కూడా పింఛను వస్తుండడంతో డబ్బుల కోసం ఆమెను కొట్టి వేధించడం మొదలు పెట్టాడు. దీంతోపాటు ఆమెను కొట్టి పీక నులమడంతో చనిపోయి విగతజీవిగా మారింది. ఉదయం ఆమెలో చలనం లేకపోవడంతో కుటుంబసభ్యులు తొండంగి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన కుమారుడు తన తల్లిని హత్య చేసినట్లు ఫిర్యాదు చేసింది. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు, ఎస్ఐ జగన్నాథంలు సంఘటనస్థలిని పరిశీలించారు. శవాన్ని శవపంచనామా నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడు

- చర్యలు తీసుకోవాలని యువతి, బంధువుల డిమాండ్

పిఠాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన యువకుడిపై చర్యలు తీసుకోవాలని బాధిత యువతి, కుటుంబసభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. వారు శనివారం పిఠాపురంలోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చి నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుని కలిసి తమకు న్యాయంచేయాలని కోరారు. కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన 19 సంవత్సరాల యువతిని అదే గ్రామానికి చెందిన పోడా అంజి అనే యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. గర్భందాల్చడంతో గర్భనిరోధక మాత్రలు ఇచ్చి తొలగించాడని యువతి, ఆమె కుటుంబసభ్యులు తెలిపారు. గ్రామపెద్దలకు విషయం తెలపడంతో ఆ యువకుడు పెళ్లి చేసుకోవాలంటే కట్నంగా కావాలని డిమాండ్ చేశాడని, దానికి తాము అంగీకరించినా పెళ్లి చేసుకోవడానికి నిరాకరిస్తున్నాడని చెప్పారు. దీనిపై తాము కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో నెలరోజుల కిందట ఫిర్యాదు చేశామని తెలిపారు. పోలీసులు చుట్టూ తిరుగుతున్నా తమకు న్యాయం జరగలేదని వారు జనసేన ఇన్ చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ద్వారా తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- నాలుగు రోజుల్లో దొంగ అరెస్టు
- రూ.50లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం


రామచంద్రపురం చోరీ వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరగ్గా అప్రమత్తమైన పోలీసులు నాలుగు రోజుల వ్యవధిలోనే కేసును ఛేదించారు. దొంగను అరెస్టుచేసి రూ.50లక్షల విలువైన 463 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రామచంద్రపురం పట్టణంలోని రామచంద్రపురం పేట స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల స్కూలు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దొంతంశెట్టి శ్రీనివాస్ కుటుంబం నివాసం ఉంటుంది. తన భార్యకు అనారోగ్యంగా ఉండడంతో ఈనెల 3వ తేదీన ఇంటికి తాళం వేసి శ్రీనివాస్ విశాఖపట్నం వెళ్లారు. ఈనెల 7వ తేదీన పనిమనిషి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తీసి ఉండడాన్ని గుర్తించి యజమానికి సమాచారం అందించింది. హుటాహుటిన శ్రీనివాస్ కుటుంబం రామచంద్రపురం చేరుకున్నారు. ఇంటి మెయిన్ డోర్ తలుపు బోల్టును స్క్రూ డ్రైవర్‌తో పగులకొట్టి తలుపు గెడను తీసి ఇంట్లోకి ప్రవేశించినట్టు గుర్తించి వెంటనే రామచంద్రపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంట్లో బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామచంద్రపురం సీఐ ఎ.వెంకటరమణ కేసు నమోదుచేసి ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించడంతో పాటు క్రైమ్ పార్టీ నేరం జరిగిన స్థలాన్ని సందర్శించి సాంకేతిక ఆధారాలను సేకరించారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని పోలీసులు గుర్తించారు. శ్రీనివాస్ ఇంట్లోనే అప్పుడప్పుడు పనిచేసే దేవగుప్త వీరబ్రహ్మం (30) ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. శ్రీనివాస్ ఉంటున్న ఇంటికి సమీపంలోనే వీరబ్రహ్మం అద్దె ఇంట్లో ఉంటున్నాడు. నిందితుడిని అరెస్టుచేసి 220 గ్రాముల మూడు రాళ్ల హారాలు, 60 గ్రాముల కాసులపేరు, 46 గ్రాముల రాళ్ల గాజులు, 36 గ్రాముల గుండుగొలుసు, 35 గ్రాముల బహుఖత్, 24 గ్రాముల అన్‌కట్ డైమండ్ నక్లెస్‌తోపాటు వివిధ బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. రూ.50లక్షల విలువైన 463 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని వీరబ్రహ్మంను అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్, దర్యాప్తులో పాల్గొన్న రామచంద్రపురం సీఐ ఎం.వెంకటనారాయణ, అమలాపురం టౌన్ సీఐ పి.వీరబాబు, ఎస్ఐ ఎం.గోపాలకృష్ణ, రామచంద్రపురం, ద్రాక్షారామ ఎస్ఐలు నాగేశ్వరరావు, లక్ష్మణ్, ఏఎస్ఐ అయితాబత్తుల బాలకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ ఏసుకుమార్, సూరిబాబు, అనిల్‌కుమార్, లోవరాజు, ఆర్మున్‌లకు ప్రశంసా పత్రాలు, నగదు పారితోషికాన్ని జిల్లా ఎస్పీ అందించారు. కేసును ఛేదించడంలో కీలకపాత్ర వహించిన ఐటీ కోర్ సీఐ జాఫర్, క్లూస్ టీమ్ సిబ్బందిని ఆయన అభినందించారు.

రోగికి వైద్యం చేస్తూ...

గుండెపోటుతో పీఎంపీ వైద్యుడి మృతి


కాకర శ్రీను

మండపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేట మండలం ఆర్తమూరు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు కాకరశ్రీను(54) శుక్రవారంరాత్రి తన క్లినిక్‌లో రోగికి వైద్యం చేస్తూ గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. హుటాహుటిన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా అప్పటికే శ్రీను మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. గ్రామంలో అందరికీ సుపరిచితుడైన శ్రీను తండ్రి నుంచి గ్రామంలో ప్రజలకు పీఎంపీగా వైద్యసేవలు చేస్తున్నాడు. ఆయన గ్రామపంచాయతీ వార్డు సభ్యుడిగా మూడు విడతల నుంచి పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆర్తమూరు వార్డు సభ్యుడిగా ఉన్నారు. మృతి చెందిన శ్రీనివాస్ కళ్లను అనవర్తికి చెందిన రాధా కృష్ణ ఐ బ్యాంకుకు కుటుంబసభ్యులు దానం చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి


లారీని ఢీకొని అక్కడికక్కడే మృతిచెందిన వ్యక్తి

తునిరూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఢీకొట్టి వ్యక్తి మృతి చెందిన ఘటన కాకినాడజిల్లా తుని మండలం ఎర్రకోనేరు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎర్రకోనేరు సమీపంలో ఒక హోటల్ ఎదురుగా ఆగివున్న లారీని రాజులతుల్లు గ్రామానికి చెందిన వేగిరాజు సూర్యనారాయణరాజు(27) ద్విచక్ర వాహనంతో వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో తుని రూరల్ పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని ప్రమాదానికిగల కారణాలను సేకరించి ఎస్ఐ కృష్ణమాచార్యులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతి చెందిన సూర్యనారాయణ ఒక పెట్రోల్‌బంక్‌లో పనిచేస్తున్నాడని ఆయనకు భార్య, తల్లిదండ్రులు ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు.

నగదు దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తుల అరెస్టు

పిఠాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెప్పి వ్యక్తి నుంచి నగదు దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను కాకినాడజిల్లా పిఠాపురం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పట్టణ పోలీసుస్టేషన్‌లో శనివారంరాత్రి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ వెల్లడించారు. కుంభవరం గ్రామానికి చెందిన వాకాడ దిలీప్ ఈనెల 5వ తేదీ రాత్రి ఇంటికి వెళ్లేందుకు పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో బస్సు కోసం వేచి ఉన్నాడు. ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి హైవేపైకి వెళ్లే ఏదో ఒక వాహనం దొరకుతుందని నమ్మించి బైక్ ఎక్కించుకున్నారు. పట్టణ శివారు బైపాస్ జైలశాఖ దాటిన తర్వాత తుప్పల్లోకి తీసుకువెళ్లి కత్తితో బెదిరించి అతని వద్ద ఉన్న రూ.29,400 లాక్కొని పరారయ్యారు. దీనిపై దిలీప్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను కొత్తపేట, జార్జి వీధులకు చెందిన ఆనంద భూపతి శ్రీనివాస్, బర్ల నరేష్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.16వేలు నగదు, మోటార్ సైకిల్, చాకు స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని సీఐ చెప్పారు.

ట్రాక్టర్ తొట్టె తిరగబడి ముగ్గురికి గాయాలు : ఒకరి పరిస్థితి విషమం

అంబాజీపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ తొట్టె తిరగబడి ముగ్గురికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. అంబాజీపేట మండలం గంగలకుర్రు గుంటమామిడి తోట మీదుగా అంబాజీపేటవైపు కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ చింతలపూడి కన్వర్షన్ హాలువద్ద ఉన్న మలుపువద్దకు వచ్చేసరికి ట్రాక్టర్ వెనుక వైపు ఉన్న తొట్టె ఇన్‌పిన్ ఊడిపోవడంతో పక్కనే ఉన్న కొబ్బరితోటలోకి ట్రాక్టర్ బోల్తాపడింది. దీంతో కర్రల లోడుపై ఉన్నముగ్గురు కూలీలకు గాయాలు కాగా, వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వీరిని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ముగ్గురు రావులపాలెం మండలానికి చెందిన వారిగా తెలుస్తోంది.

అత్యవసర మందులు అందుబాటులో ఉండాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు కోరుకొండ పీహెచ్‌సీ ఆకస్మిక సందర్శన


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

కోరుకొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి): అత్యవసర మందులు అన్ని వేళలా అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది పనితీరు, ఇన్‌పేషెంట్స్, అవుట్‌పేషెంట్స్ వివరాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తంచేశారు. ప్రతి రోజు అవుట్‌పేషెంట్స్ 100 నుంచి 150 మంది వైద్యం పొందుతున్నారని ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ జ్ఞాన చంద్రరావు తెలిపారు. ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, పేషెంట్స్ వార్డు, మందులు గది, రిసెప్షన్, ల్యాబ్ రూంలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన కుటుంబ సంక్షేమ ఆరోగ్య కార్యక్రమాలు 100శాతం లక్ష్యాలు సాధించాలని సూచించారు. పీఎంవీవీపై, పీఎంఎస్ఎంఏ, యూఐపీ, ఎన్‌సీడీసీడీ, ఏబీహెచ్‌ఏ ఐడీలు, టీబీ ముక్తి భారత్, ఎన్‌ఎల్‌ఈపీ, అంటు వ్యాధుల నివారణ, జింక్ కార్నర్ కార్యక్రమాల రికార్డులను పరిశీలించి ముఖ్య సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలు సేవలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట బొర్రే రాజు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

15న కలెక్టరేట్ వద్ద ప్రభుత్వ పెన్షనర్స్ ధర్నా

పెన్సనర్ల సంఘం అధ్యక్షుడు కేకే

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): అలిండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌జీపీఎఫ్)పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఈనెల 15న శాంతియుత ధర్నా నిర్వహిస్తున్నామని రాజమహేంద్రవరం పెన్సనర్స్ అధ్యక్షుడు కేకే సంజీవరావు తెలిపారు. 15న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ధర్నా చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన వేలిడేషన్ అమెండ్మెంట్‌ను రద్దుచేయాలని, 12వ పే కమిషన్ నియమించి తక్షణం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఆర్ సహా అన్ని బకాయిలను చెల్లించాలనే డిమాండ్ల సాధనల కోసం ధర్నా చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ శాంతియుత ధర్నాలో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, క్లాస్4 , డ్రైవర్లు, రిటైర్డ్ కార్మికులు రావాలని పిలుపునిచ్చారు.

'సత్యసాయి కార్మికులకు జీతాలు చెల్లించాలి'

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం పురుషోత్తపట్నంలోని శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి కార్మికులకు 19 నెలలుగా జీతాలు, 26 నెలలుగా ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ కోరారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరం లాలాచెరువు సెంటర్లోని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న కార్మికులకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ఐదు రోజుల నుంచి సత్యసాయి కార్మికులు సమ్మె చేస్తున్నా కాంట్రాక్టర్ కానీ, అధికారులు కానీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మెకు ఆర్‌డబ్ల్యుఎస్, సీపీడబ్ల్యు స్కీమ్స్ రాష్ట్ర యూనియన్ సభ్యులు రాయుడు శ్రీను, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు తమ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇసాక్, కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పెద్దపీట

ఎమ్మెల్యే నల్లమిల్లి.. పొలమూరు, ఎస్టీ రాజాపురంలో సుపరిపాలనలో తొలి అడుగు


మహిళకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పొలమూరు గ్రామంలో ఆయన టీడీపీ ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంచారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాది కాలంలో పొలమూరు గ్రామంలో రూ.8.86 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిని అందించామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో చేయని అభివృద్ధిని ఏడాదిలో చేసి చూపామని, రానున్న రోజుల్లో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, ఎస్‌ఆర్‌కె ప్రసాదరెడ్డి, కర్రి శేషారత్నం, గొల్లు హేమతులసి పాల్గొన్నారు.

రంగంపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్టీ రాజాపురంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంచారు. కూటమి ప్రభుత్వంలో గ్రామంలో సుమారు రూ.2.57 కోట్లలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, నీలపాల త్రిమూర్తులు, ఎలుగుబంటి సత్తిబాబు, గిరజాల సత్తిబాబు, పూసల శ్రీను, పోతుల వెంకట్రావు, అడబాల వెంకట్రావు, కడిమి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

బైక్ గోతిలో పడి మహిళకు గాయాలు


ప్రమాదానికి కారణమైన గొయ్యి

బిక్కవోలు, జూలై 12(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు కెనాల్ రోడ్డులో బైక్ అదుపు తప్పడంతో ఓ మహిళకు గాయాలయ్యాయి. శనివారం బైక్ గోతిలో పడడంతో చల్లపల్లి విజయలక్ష్మి అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. సామర్లకోటకు చెందిన విజయలక్ష్మి కుమారుడు మల్లేష్‌తో కలిసి పెద్దాపురం మండలం చదలవాడలోని తిరుపతి వేంకటేశ్వరున్ని దర్శించుకున్నారు. ఆపై ద్వారపూడి అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్తుండగా బిక్కవోలు వంతెన దాటాక పోతురాజు బాబు గుడి సమీపంలోని రోడ్డుపై పడ్డ పెద్ద గోతిలో బైక్ పడడంతో వెనుక కూర్చున్న విజయలక్ష్మి ఒక్కసారిగా ముందుకు పడిపోవడంతో ముఖంపైన, నుదుటిపైన, చేతులకు గాయాలయ్యాయి. దీంతో ఆమెను రోడ్డు ప్రక్కన కూర్చోబెట్టి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా వారు వచ్చి చికిత్స నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఈ గోతిలో తరచూ వాహనదారులు పడి గాయాల పాలవుతున్నారని వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై బిక్కవోలు ఆర్‌అండ్‌బీ ఏఈ పెండ్యాల రాంబాబును వివరణ కోరగా బిక్కవోలు నుంచి అనపర్తి వరకూ రోడ్డు మరమ్మతులకు రూ.4.50 కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు పిలిచామని, కాంట్రాక్టరు వచ్చిన వెంటనే మరమ్మతులు చేపడతామని చెప్పారు.


గాయాల పాలైన విజయలక్ష్మి

యాదవ మహాసభ రెజెంగ్లా పవిత్ర కలశయాత్ర


రెజెంగ్లా పవిత్ర కలశ యాత్ర దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): భారత సైన్యంలో తొలగించిన యాదవ రెజిమెంట్ సాధన కోసం అఖిల భారత యాదవ మహాసభ చేపట్టిన రెజెంగ్లా పవిత్ర కలశ యాత్ర రాజమహేంద్రవరం చేరింది. అఖిల భారత యాదవ మహాసభ -జాతీయ కమిటీ యాదవ రెజిమెంట్‌ను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ యాదవ వీరులు రక్తతర్పణం చేసిన మట్టిని సేకరించి భారతదేశ వ్యాప్తంగా లక్ష కిలోమీటర్ల రెజెంగ్లా రాజ్ కలశ యాత్ర ఈ ఏడాది ఏప్రిల్ 13న బీహార్ రాష్ట్రంలో చారిత్రాత్మక చాప్రా నుంచి ప్రారంభమైంది.ఈ యాత్ర బీహార్ నుంచి జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌గఢ్, ఒడిసా, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, విశాఖపట్టణం, అనకాపల్లి మీదుగా శనివారం రాజమహేంద్రవరం చేరుకుంది. ఈ సందర్భంగా లాలాచెరువు వద్ద ఈ యాత్రకు యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు నొడగల సుధా యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి కోటిపల్లి బస్టాండ్‌కు ర్యాలీగా చేరుకుంది. కార్యక్రమంలో మరుకుర్తి రవియాదవ్, పడాల నాగరాజుయాదవ్, మిస్కా జోగినాయుడు యాదవ్, మరుకుర్తి నరేష్‌కుమార్ యాదవ్, నక్కెళ్ళ బాబురావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు చీర, సారె

ఉండ్రాజవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రులో శనివారం ఆషాఢ మాసం సందర్భంగా కనకదుర్గమ్మకు మహిళలు సారె, చీర సమర్పించారు. అనంతరం కుంకుమ పూజలు, లలిత సహస్రనామపారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

జిల్లా కలెక్టర్ ప్రశాంతి


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

దివాన్‌చెరువు, జూలై12 (ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం దివాన్‌చెరువు గ్రామంలో పంచాయతీ తీసిన గుంతలో పడి చిన్నారి బాలుడు కడమంచి శ్రీను మృతిచెందిన విషాద సంఘటన నేపథ్యంలో స్పందించిన ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ప్రకటించిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఆమె క్షేత్రస్థాయిలో శుక్రవారం అర్ధరాత్రి పర్యటించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంఘటనపై రాజానగరం తహశీల్దార్ సమగ్ర నివేదిక సమర్పించారని చెప్పారు. ఈ నెల 10న ఓహెచ్‌ఎస్‌ఆర్ వద్ద గుంత తవ్వి వాల్వ్‌ను మరమ్మతుల కోసం రాజమహేంద్రవరం పంపారన్నారు. ఈ లోగా గుంతలో నీరు చేరిందని, ఆ గుంతలో ప్రమాదశాత్తూ చిన్నారి పడి మృతిచెందినట్టు పేర్కొన్నట్టు కలెక్టర్ చెప్పారు. ఘటన ఆమె తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా గుంతల విషయంలో భద్రతాచర్యలు తీసుకోవడంలో జాప్యం జరగకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ కెంట ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బీవీ గిరి, తహశీల్దార్ జీవీఎల్ దేవి తదితరులున్నారు.

బాలుడి మృతి బాధాకరం: బత్తుల

పంచాయితీ సిబ్బంది కుళాయి కోసం తీసిన గుంతలో బాలుడు పడి మృతిచెందడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే, నాసేన కోసం నావంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి శనివారం పరామర్శించారు. రూ.లక్షను తక్షణం సహాయంగా అందజేశారు. కాలనీని అభివృద్ధి చేస్తామన్నారు. సీఎం చంద్రబాబుకు ఈ విషయం తెలియపరచగా తక్షణమే స్పందించి రూ.5 లక్షల పరిహారంతో బాటు బాధిత కుటుంబానికి ఇంటి పట్టా ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో కందుల బాబూరాయుడు, వంక మల్లిబాబు, యర్రంశెట్టి శ్రీను, మప్పనపల్లి రాజు, ఖండవిల్లి లక్ష్మీ, అక్కిరెడ్డి వేణు, చాపలలక్ష్మీ, గొల్లకోటి రాజు తదితరులు పాల్గొన్నారు.


బాలుడి తల్లిని ఓదార్చుతున్న ఎమ్మెల్యే బత్తుల

గ్యాస్ సబ్సిడీపై అపోహలు తొలగించండి

ఏజెన్సీల నిర్వాహకులతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12(ఆంధ్రజ్యోతి): దీపం పథకంలో గ్యాస్ సబ్సిడీపై వినియోగదారుల్లో ఉన్న అపోహలను తొలగించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శనివారం రెవెన్యూ అధికారులు, నగర పరిధిలోని 12 గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్యాస్ సబ్సిడీపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు మాట్లాడుతూ అర్హులైన వినియోగదారులకు తప్పక సబ్సిడీ వారి బ్యాంక్ ఖాతాల్లో పడుతుందని, అయితే వినియోగదారులకు మూడేసి బ్యాంక్ ఖాతాలు ఉండడం వల్ల ఏ ఖాతాలో జమయ్యిందో తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరికి సొంతిల్లు ఉండడం, విద్యుత్ బిల్లులు అధికంగా రావడం, ఆదాయపు పన్నులు చెల్లించడం వల్ల సబ్సిడీ రావడం లేదని ఎమ్మెల్యేకు చెప్పారు. గ్యాస్ సబ్సిడీ నగదు బ్యాంక్ ఖాతాలో జమయ్యిందో లేదో 95523 00009 నెంబరు ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. ఈ మేరకు గ్యాస్ ఏజెన్సీల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు.

రాజమహేంద్రవరం అభివృద్ధి కూటమిదే..

రాజమహేంద్రవరం అభివృద్ధి అంటే కూటమి ప్రభుత్వ చేసిందేనని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. శనివారం స్థానిక 9వ డివిజన్‌లో ఎస్‌బీఐ కాలనీ, కాంచన నగర్, వాకర్స్ రోడ్డు, విద్యుత్ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 9వ డివిజన్‌లో రూ.8 కోట్లతో పలు రకాల అభివృద్ధి పనులు చేశామన్నారు. నగరంలో అవసరమైన ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ కోసూరి చండిప్రియ, కంటిపూడి రాజేంద్రప్రసాద్, కొల్లి బుజ్జి, రెడ్డి, శాస్త్రి సుబ్బారావు, తమ్మిరాజు, వీరన్న సరస్వతి, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరవధిక దీక్ష



నిడదవోలు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ స్మార్ట్‌మీటర్లు బిగించే ప్రక్రియతో భవిష్యత్‌లో ప్రజలకు పెనుభారంగా మార నుందని కాంగ్రెస్ పార్టీ నిడదవోలు నియోజక వర్గ కోఆర్డినేటర్ మేడవరపు భద్రందొర అన్నారు. శనివారం పట్టణంలోని డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌మీ టర్లు ఏర్పాటు అదానీ జేబు నింపడమే అని ప్రజల కోసం కాదని అన్నారు. కార్యక్రమంలో చిన్నం మురళీకృష్ణ, అరిగెల అరుణకుమారి, అగర్వాల్ హీరా లాల్, భావన రమేష్, పెచ్చేటి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన దేవరపల్లి
వెంకన్న ఆలయం

దేవరపల్లి, జూలై 12 (ఆంధ్ర జ్యోతి): దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు కాలినడకన వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ ఆలయంలో భక్తులు ఎక్కువ శాతం 108 ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించు కోవడం విశేషం. స్వామివారికి ప్రసాద వితరణను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సుజాత దంపతులు స్వామివారికి అలంకరణ చేశారు. దాతలు పిన్నమని ప్రసాద్, సత్యనాగిని దంపతులు ఎమ్మెల్యేకు స్వామివారి దర్శన అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు కేశవచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు వేదాశీర్వ చనాలు అందించారు. కార్యక్రమంలో స్థానికులు ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, స్థానికులు తీగల బలరామయ్య, గుడ్ల వెంకటేశ్వరరావు, కొండపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆర్టీసీ ఎండీ.. సత్యదేవా నర్సరీ సందర్శన


సజ్జనార్‌కు మొక్కను అందజేస్తున్న అబ్బులు

కడియం, జూలై 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్‌టీసీ) ఎండీ విశ్వనాద్ చెన్నప్ప సజ్జనార్ తన కుటుంబసభ్యులతో కలిసి శనివారం కడియపులంక పుల్లా ఆంజనేయులు-సత్యదేవా నర్సరీని సందర్శించారు. అంజనేయులు మొక్కను అందజేసి స్వాగతించారు.నర్సరీలో వివిధ రకాల మొక్కలను తిలకించారు.ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ తనకు ఆర్గానిక్ ఫలాలు అంటే ఎంతో ఇష్టమన్నారు. నర్సరీ రైతులు వ్యాపార దృక్పథంతో కాకుండా ప్రకృతికి సేవచేసే విధంగా ఉండడంతో పాటు, పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పుల్లా వీరబాబు, పుల్లా రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

కాతేరు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ బాధ్యతల స్వీకారం


కాతేరు ఈఏసీఎస్ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాతేరులో రాజ్యలక్ష్మి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ పదవీ బాధ్యతలు చేపట్టింది. కమిటీ చైర్మన్‌గా నున్న బాబూరావు, సభ్యులుగా ఈదర రాఘవబాబు, సోము గంగాధర్‌లతో సంఘ ముఖ్యకార్యదర్శి ప్రమాణం చేయించారు. కమిటీ సభ్యులను గంగిన వీర హనుమంతరావు, నున్న కృష్ణ, మద్దిపాటి వెంకటరామకృష్ణ అభినందించారు.

బాధితురాలికి మాజీ హోం మంత్రి పరామర్శ

అనపర్తి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6న దుప్పలపూడిలో జరిగిన దాడిలో గాయపడి అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత మహిళ బుజ్జిని శనివారం రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ అని చూడకుండా దాడి చేయడం అమానుషమన్నారు. దళిత బంధువు అని చెప్పుకునే కూటమి ప్రభుత్వం దళిత మహిళపై జరిగిన దాడిని ఇప్పటి వరకు ఖండించక పోవడం, పరామర్శించకపోవడం దారుణమన్నారు. ఆమెకు న్యాయం జరిగే వరకు అండగా వైసీపీ ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో సర్పంచ్ వల్లభశెట్టి శివ పద్మిని ఆర్థిక సహకారంతో 10మంది విద్యార్థినులకు సమకూర్చిన సైకిళ్లను వైసీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఇన్‌చార్జి వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుడ్గ జంగం సమాజం ఆత్మీయ సమ్మేళనం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): బుడ్గ జంగం సమాజం ఆత్మీయత, ఆదరణ అభినందనీయమని రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని వెంకటనగరం పరిధిలో వెంకటాద్రి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన రాష్ట్ర బేడా(బుడ్గ)జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. దీనికి మంత్రి దుర్గేష్‌తోపాటు ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేఎస్ జవహర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సందర్భంగా మాట్లాడుతూ బుడ్గ జంగం హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామన్నారు. సమాజ అభివృద్ధిలో ప్రతి వర్గం భాగస్వామిగా మారేలా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా దుర్గేష్, జవహర్‌లను ఘనంగా సత్కరించారు.

'ఖాళీగా ఉన్న క్లాస్-4 ఉద్యోగాలను భర్తీచేయాలి'

క్లాస్-4 ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ

కొవ్వూరు, జూలై12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న క్లాస్-4 ఉద్యో గాలను వెంటనే భర్తీచేయాలని క్లాస్-4 ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ ఉద్యోగుల జిల్లా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణీసుస్మితను కలిశారు. వెంకటరమణ మాట్లాడుతూ మండలంలో కనీసం రెండు అటెండర్ పోస్టులు, ఒక నైట్‌వాచ్‌మెన్ పోస్టులు ఉండాలని, అయితే ప్రస్తుతం చాలాచోట్ల ఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఉన్న సిబ్బంది పైనే ఒత్తిడి పెరుగుతుందన్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ఎండీ తాజుద్దీన్, ఎం.సుబ్రహ్మణ్యం, క్లాస్-4 ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

'వైద్య, ఆరోగ్యశాఖలో సిబ్బంది కొరత తీర్చాలి'

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఉద్యోగుల కొరత తీర్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం రాజమహేంద్రవరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖలో సిబ్బంది కొరత తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, దీని వల్ల వైద్య ఆరోగ్యసేవలు సక్రమంగా అందడంలేదన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు పి.రవికుమార్ మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖలో రాష్ట్రంలో కొన్ని వందల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని వెంటనే భర్తీ చేయాలన్నారు. దశాబ్దాల నుంచి స్టాఫ్ ప్యాటర్న్ మారలేదని, దీన్ని కొత్తగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీజీయూలో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు


పోటీల్లో తలపడుతున్న ఫుట్‌బాల్ క్రీడాకారులు

రాజానగరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సబ్-జూనియర్ బాలుర ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్-2025 ఫుట్‌బాల్ టోర్నమెంట్ గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో శనివారం ప్రారంభమైంది. ఈ పోటీలను రోటరీక్లబ్ ఆఫ్ ఐకాన్స్ చాప్టర్ ప్రెసిడెంట్ తీగల రాజా పావురాలను గాలిలో ఎగరేసి ప్రారంభించారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ తరఫున రెండు రోజుల పాటు జరిగే ఈ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 9జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన క్రీడాకారులను ఆగష్టు 10న మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో రోటరీ ఐకాన్స్ ప్రెసిడెంట్ మండవిల్లి వెంకన్నబాబు, సంయుక్త కార్యదర్శి నవీన్, కోశాధికారి దావూద్ ఇబ్రహీం, కోర్సు డైరెక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి కర్ణాటక మంత్రి పూజలు


మంత్రి మల్లిఖార్జున్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కడియం, జూలై 12(ఆంధ్రజ్యోతి): కడియపులంకలో హరిహర మహాక్షేత్రంలోని వేంకటేశ్వరస్వామిని కర్ణాటక రాష్ట్ర మైనింగ్, జియాలజీ, ఉద్యానశాఖ మంత్రి ఎస్.మల్లికార్జున్ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన మంత్రిని ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం అనంతేశ్వరస్వామి, సాయిబాబా ఆలయాలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో నర్సరీ సంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, మల్లు పోలరాజు, బీజేపీ మండలాధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ పంతం గణపతి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్
జవహర్‌కు సత్కారం

కొవ్వూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కమిషన్ చైర్మన్ జవహర్‌ను సఫాయి కర్మచారి ఆందోళన్ (నేషనల్)సంఘం శనివారం మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి శాలువా కప్పి సత్కరించారు. దీర్ఘకాలంగా ఎదుర్కొనే సమస్యలను తెలియజేసి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం కొవ్వూరు మండలం ధర్మవరంలో ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన జొన్నకూటి సౌమ్య కుటుంబాన్ని పరామర్శించి, రూ.10 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రావిశెట్టి రామచంద్రరావు, బొచ్చ అప్పారావు, భార్గవి మంగవతి, శ్రీనివాస్ యర్రంశెట్టి అప్పారావు, బొబ్బిలి చిన్ని పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 13 జూలై 2025 | 5



వరద గోదారి

సముద్రంలోకి 5.29 లక్షల క్యూసెక్కులు



అందమంటూ : రోడ్ కం రైలు బ్రిడ్జిని తాకేలా గోదావరి వరద

పరుగో..పరుగు : బొబ్బర్లంక వద్ద వరద ఉధృతి

గోదావరికి వరద పోటెత్తింది.. నిండు కుండలా మారింది.. లంకలను ముంచుతూ దిగువకు దూసుకొస్తోంది.. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో అఖండ గోదావరి ఉరుకులు.. పరుగులు పెడుతోంది.. ఈ ఏడాది తొలిసారి వరద ఉధృతంగా మారింది.. సముద్రంలోకి సుమారు 5.29 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.. ఇంత ఎక్కువ నీరు విడుదల చేయడం ఈ ఏడాది ఇదే. ఇది ఏడు లక్షల వరకూ పెరగవచ్చని అంచనా.. నిన్నటి వరకూ ఎంతో ప్రశాంతంగా ఉన్న గోదావరి శనివారం ఒక్కసారిగా ఉధృతంగా మారడంతో జనం చూసేందుకు ఎగబడుతున్నారు.. ఎగువున తగ్గుముఖం పట్టడంతో దిగువన వరద ఉధృతి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. 8

రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు
మినిస్టీరియల్ అవార్డు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగర పాలక సంస్థకు స్టేట్ లెవెల్ మినిస్టీరియల్ అవార్డు లభించింది. గతంలో దేశంలో మంచి ర్యాంక్‌లు సాధించిన నగరాలను పరిశీలించి వాటికి జాతీయ స్థాయిలో సూపర్ లీగ్ సిటీస్‌గా, స్పెషల్ స్పెషల్ కేటగిరి,మినిస్టీరియల్ అవార్డులకు ఎంపిక చేసి కేంద్రప్రభుత్వం శనివారం ప్రకటించింది. నగరపాలక సంస్థకు కమిషనర్‌గా పనిచేసి ఇటీవల బదిలీ అయిన కేతన్‌గార్గ్, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, కార్మికులు నగర శుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. పరిశుభ్రత, మెరుగైన పారిశుధ్యం, శాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని మినిస్టీరియల్ అవార్డును రాష్ట్రస్థాయిలో ఎంపిక చేశారు. ఈ మేరకు అవార్డు వరించింది.ఈ అవార్డును ఈనెల 17న దేశరాజధాని ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర మంత్రి చేతుల మీదుగా ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ పి.ప్రశాంతి అందుకుంటారు. అవార్డుతో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కీర్తి ఇనుమడించబోతుంది.



అవార్డు బాధ్యత పెంచింది



రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు స్వచ్ఛసర్వేక్షణ్‌లో స్టేట్ లెవెల్ మినిస్టీరియల్ అవార్డు రావడం నగరాభివృద్ధిలో కీలక మైలురాయి. నగరపాలక సంస్థ చేపట్టిన అభివృద్ధి ప్రజా సేవా కార్యక్రమాలకు ఇది లభించిన గౌరవప్రద గుర్తింపు. ఆ గుర్తింపును నిలబెట్టుకుంటాం. పారిశుధ్యంపై మరింత దృష్టి సారిస్తాం. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు రావడం ఆనందంగా ఉంది. **- ప్రశాంతి, కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్**

ఆదివారం ప్రత్యేకం



అదిగో పులి!

అచ్చంగా 'పులి' లెక్క.. కానీ ఇది ఫిషింగ్ క్యాట్

కేరాఫ్ కోరంగి..

చూడ్డానికి అందంగా, గుబురుగా.. దట్టంగా కనిపించే మడ అడవులు దేశంలో కాకినాడకే ప్రత్యేకం. రాష్ట్రంలో గోదావరి పరీవాహక ప్రాంతంలో 331.5 చదరపు కిలోమీటర్లలో ఇవి విస్తరించగా కృష్ణా పరీవాహక ప్రాంతంలో 250 చదరపు కిలోమీటర్లు ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తాళ్లరేవు మండలం కోరంగి నుంచి ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లో 58 వేల ఎకరాల్లో ఉన్నాయి. మడ అడవుల్లో 80 రకాల వృక్షజాతులున్నాయి. ఏటా ఎనిమిది దేశాల నుంచి 120 జాతుల వలస పక్షులు వస్తాయి. వందల రకాల చేప జాతులు ఇక్కడకు వచ్చి గుడ్లు పొదుగుతాయి. ఎన్నో రకాల పక్షి, జంతుజాతులు ఉండగా వాటిలో ప్రత్యేకత సంతరించుకున్నవే ఫిషింగ్ క్యాట్‌లు. ప్రపంచంలో ఇవి పది వేల వరకు ఉండగా దేశంలో రెండు వేలలోపే ఉన్నాయి. ఇందులో 155 కోరంగిలోనే ఉన్నాయి. ఇప్పుడు నాలుగేళ్ల తర్వాత వీటి సంఖ్య లెక్కించడానికి అటవీ శాఖ రంగంలోకి దిగింది. దేశంలోనే తొలిసారిగా వీటి సంఖ్యను లెక్కించడానికి రేడియో కాలర్ రింగ్ విధానం అమలు చేస్తున్నారు. ఈ ఫిషింగ్ క్యాట్‌ల మెడకు వీటిని బిగించి కొన్ని రోజుల పాటు అధ్యయనం చేయడానికి డెహ్రాడూన్ నుంచి నిపుణులు వచ్చి కోరంగిలో మకాం వేశారు. మూడింటికి వీటిని బిగించారు. త్వరలో మరో ఏడింటికి బిగించబోతున్నారు.

- కోరంగి అభయారణ్యం ఆవాసం
- సరికొత్తగా ఫిషింగ్ క్యాట్‌ల లెక్క
- మత్స్యసంపద వృద్ధిలో కీలకం
- వైల్డ్‌లైఫ్ ఇన్స్టిట్యూట్ ప్రాజెక్టు
- వీటి మెడకు రేడియో కాలర్ రింగ్
- దేశంలోనే తొలిసారిగా కౌంటింగ్
- అంతరించే జాతిలో ఈ క్యాట్‌లు
- జియోట్యాగింగ్‌తో పరిశీలన

వాటిని చూస్తేనే ఒళ్లు జలదరిస్తుంది.. రాత్రి వేళలో కనిపిస్తే గుండెజల్లుమంటుంది.. చిరుత పులిలా ఒంటి నిండా చారలు.. కోర మీసాలు.. పులి తరహాలో కళ్లు..అమ్మో మీదకు వచ్చేస్తుందేమోనని భయపెడుతుంది..కానీ అది పులికాదు.. అచ్చం పులినే తలపించే ఆ తరహా జాతికి చెందినదే.. ఎత్తు తక్కువే కాని పులినే పోలి ఉంటుంది.. నోరు తెరిస్తే భయంకరమైన పళ్లు... పొడవాటి నాలుక.. నిజంగా పులే అని భయపడేలా చేస్తుంది.. ఇంతకీ దీని పేరేమిటో తెలుసా.. ఫిషింగ్ క్యాట్..

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

నిజమైన పులి జంతువులను వేటాడడంలో ఎంత నేర్పరో..ఈ ఫిషింగ్ క్యాట్ (బావురుపిల్లి, నీటి పిల్లి) నీటిలో చేపలను వేటాడి తినడంలో ఎంతో నేర్పరి.. ఇది తినే చేపలతో సముద్రంలో మత్స్య సంపద పెరగడానికి దోహదపడుతుంది.. ఇదేంటి చేపలను తినే పిల్లి వల్ల చేప సంపద ఎలా పెరుగుతుంది అంటారా.. నిజమే.. చేపలు పెట్టే గుడ్లను తినే చేప జాతులు ఎన్నో మడ అడవుల్లో ఉన్నాయి..అలా గుడ్లను తింటూ మత్స్య సంపద పెరగకుండా చేసే చేపలనే ఈ ఫిషింగ్ క్యాట్‌లు తింటాయి..ఈ ఫిషింగ్ క్యాట్‌లు ఐయూసీఎన్ జాబితాలో అంతరించిపోయే ప్రమాదం ఉన్న జాతిగా గుర్తించారు.ఈ ఫిషింగ్ క్యాట్‌లకు కోరంగి అభయారణ్యం పెట్టింది పేరు.

నిరంతర పర్యవేక్షణ..

దేశంలోనే కోరంగి అభయారణ్యంలో వీటిని లెక్కించడానికి వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రత్యేక ఆసక్తి కనబర్చింది. వాస్తవానికి కోల్‌కతాలోని సుందర్‌బన్ అడవుల్లో వీటి జాడ ఎక్కువ.ఈ ఫిషింగ్ క్యాట్ పశ్చిమబెంగాల్ రాష్ట్ర అధికారిక జంతువు కూడా. అయితే కోరంగిలోనే వీటి లెక్కింపునకు అనువైన వాతావరణం ఉండడంతో దేశంలో తొలిసారి ఇక్కడే ఇటీవల ప్రారంభించారు.ఈ ప్రాజెక్టును డెహ్రాడూన్‌లోని వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ బిలాల్ హబీబ్ పర్యవేక్షిస్తుండగా కోరంగికి సైంటిస్ట్ షాహిర్‌ఖాన్, వెటర్నరీ ఆఫీసర్ సనంత్ వచ్చారు. వీరిలో సనంత్ దేశంలో ఇప్పటి వరకు 100కుపైగా పులులకు నెక్ రేడియోకాలరింగ్ అమర్చడంలో పేరు పొందారు. ఈ రేడియో కాల ర్ రింగ్‌కు జియో ట్యాగింగ్ చేసి నిత్యం వీటి కదలికలను పరిశీలిస్తున్నారు. అలాగే 90చోట్ల చెట్లకు ట్రాప్ కెమెరాలు అమర్చారు. త ద్వారా కోరం గిలో వీటి సంఖ్యను నిర్ధారించనున్నారు.

ఈదేస్తాయి..వేటాడేస్తాయి..

అచ్చం పులిని తలపించే ఈ ఫిషింగ్ క్యాట్‌లకు ఎంతో ప్రత్యేకత ఉంది. అసలు పులులు జంతువులను వేటాడడంలో ఎంత నేర్పరో ఇవి కూడా నీటి అడుగున ఉండే చేపలను తినడంలో నేర్పరులు. వాస్తవానికి సముద్రం, గోదావరి నీరు సంగమించే ప్రాంతంలో ఉప్పు, చప్పటి నీరు ఉంటుంది. ఇది చేప సంతతి వృద్ధికి అనుకూలం.అందుకే ఎన్నో రకాల మత్స్య జాతులు మడఅడవుల్లోకి వచ్చి గుడ్లు పొదుగు తాయి.ఇవి పిల్లలుగా మారడానికి మడ అడవుల్లోని చిత్తడి నేలలు అత్యంత అనుకూలం. ఈ గుడ్లను కొన్ని రకాల చేపలు తినేస్తాయి. తద్వారా మత్స్య సంపద వృద్ధికి ఇవి హాని చేస్తాయి. ఇలా గుడ్లు తినేసే కొన్ని రకాల జాతి చేపలను ఈ ఫిషింగ్ క్యాట్‌లు తింటాయి. తద్వారా సముద్రంలో మత్స్య సంపద పెరగడానికి దోహదపడతాయి. పులి తరహాలో కొంత దూకుడు స్వభావం ఉంటుంది. మనుషులకు హాని చేయవు.ఇప్పుడు వీటి సంఖ్య లెక్కిస్తున్నామని కోరంగి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, డీఎఫ్‌వో రవీంద్ర నాథ్‌రెడ్డి వివరించారు.



ఫిషింగ్ క్యాట్‌లకు నెక్ రేడియోకాలర్ రింగ్ చేస్తున్న నిపుణులు

గూడు..గోడు!

- 1595 నిర్మాణాలు ఆన్‌లైన్
- ఇంకనూ పూర్తికాని లాగిన్
- బిల్లులందక నీరసం
- అసంపూర్తిగా నిర్మాణాలు



(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

పేదలకు గూడు గోడు తప్పడంలేదు.. ప్రభుత్వ సాయం సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నారు. సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకుంటే రూ.2.5 లక్షల రుణం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లాలోని హౌసింగ్ అధికారుల అనుమతితో అనేక మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈ ఏడాది జూన్ రెండో తేదీన చాలా మందికి శాంక్షన్ ఆర్డర్లు వచ్చాయి. కొందరు బేస్‌మెంట్ వరకూ నిర్మించగా..కొందరు శ్లాబ్ వేసుకున్నారు. వాటిని ఫోటోలు తీసి హౌసింగ్ అధికారులు తమ యాప్‌లో డౌన్‌లోడ్ చేసి ఆన్‌లైన్ చేస్తున్నారు. ప్రభుత్వ లాగిన్ ఇంకా ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. నిధులు విడుదల కాకపోవడంతో ప్రస్తుతం అనేక ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. అప్పోసప్పో చేసి పూర్తిగా నిర్మిస్తే లోన్ వస్తుందోలేదోననే భయం లబ్ధిదారుల్లో ఉంది. అధికారులు మాత్రం కొన్ని చోట్ల గోడలు కట్టకుండా మిగతా పనులు పూర్తి చేసుకోమని చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 1595 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం ఆన్‌లైన్ చేశారు. వారిలో చాలా మందికి శాంక్షన్ ఆర్డర్లు వచ్చాయి.ఇంకా కొన్ని ఆన్‌లైన్ చేయాల్సి ఉన్నట్టు సమాచారం. ఇక ప్రభుత్వం లాగిన్ ఇస్తే బిల్లులు కూడా పడతాయి. అనపర్తిలో 19, బిక్కవోలులో 51, చాగల్లులో 35, గోపాలపురంలో 56, కడియంలో 76, కోరుకొండలో 94, కొవ్వూరు అర్బన్‌లో 172, నిడదవోలు రూరల్‌లో 17, నిడదవోలు అర్బన్‌లో 120, పెరవలిలో 20, రాజమండ్రి అర్బన్‌లో 465, రాజమండ్రి రూరల్‌లో 96, రాజానగరంలో 139, రంగంపేటలో 87, సీతానగ రంలో 28, ఉండ్రాజవరంలో 97 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. వీటిని పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వం ఇచ్చే సొమ్ము కోసం లబ్దిదారులు ఎదురు చూస్తున్నారు.

అమ్మా..బాధపడకమ్మా!



దివాన్‌చెరువు గ్రామంలో శుక్రవారం నాలుగేళ్ల బాలుడు బోరుబావిలో పడి మృతిచెందిన ఘటన విదితమే.. దీంతో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ.. ఇటు కలెక్టర్ ప్రశాంతి కదిలారు.. బాలుడి తల్లిదండ్రులకు అండగా నిలిచారు.. ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు. అంతే కాకుండా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఇంటి స్థలం కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు..

ఏపీ పేపర్‌మిల్లు లాకౌట్ ఎత్తివేత

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరంలోని ఏపీ పేపరుమిల్లు లాకౌట్‌ను ఎత్తివేసింది. మిల్లు కార్మిక నేతలతో శుక్రవారం రాత్రి మంత్రి దుర్గేష్, జిల్లా కలెక్టర్ ప్రశాంతి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణలు చర్చించిన సంగతి తెలిసిందే. అనంతరం మిల్లు వద్దకు చేరుకున్న కార్మికులు 11 కార్మిక సంఘాల నేతలు,కార్మికులతో చర్చించుకున్నారు. అయితే అప్పటికే మిల్లు యాజమాన్యం లాకౌట్ నోటీస్ జారి చేసింది. ఇందులో కొంత మందిపై క్రమశిక్ష ణ చర్యలు తీసుకున్నట్టు ప్రకటించింది. శనివారం కార్మిక నేతలతో జరిగిన సంప్రదింపుల అనంతరం వచ్చేవారంలో మంత్రి, ముఖ్యకార్యదర్శి, ప్రజా ప్రతినిధులు సమక్షంలో చర్చించి వేతన ఒప్పందం అమలుకు చర్యలు తీసుకునేలా కనిపించడంతో యాజమాన్యం లాకౌట్ ఎత్తివేసింది. కార్మికులపై విధించిన సస్పెండ్‌ను ఎత్తివేసింది.దీంతో శనివారం రాత్రి నుంచి 600 మంది పర్మినెంట్, 1600 మంది తాత్కాలిక కార్మికులు విధులకు వచ్చారు.



పోలీస్ టెక్నాలజీ బాగుంది!

జిల్లా పోలీసుల టెక్నాలజీ.. ఆయుధ సంపత్తిని చూసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆశ్చర్యపో యారు..వివిధ శాఖలతో ఎస్పీ నరసింహ కిషోర్ శనివారం నిర్వహించిన అర్ధ సంవత్సర సమన్వయ సమావేశానికి ముఖ్యఅతిథిగా పీడీజే హాజరయ్యారు. పోలీసులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని సందర్శించారు. దీనిలో భాగంగా డ్రోన్ కెమెరాలను చూసి ఇవి ఎలా పనిచేస్తాయని అడిగి తెలుసుకున్నారు.. ఎస్పీ నరసింహ కిశోర్ ఆయుధ సంపత్తి, డ్రోన్ కెమెరాల పనితీరును వివరించారు.టెక్నాలజీ బాగుందంటూ కితాబిచ్చారు.



అ..సౌకర్యం!

రైల్వే అధికారులు చింతించండి

సదుపాయమంటూ..

రాజమండ్రి స్టేషను ఎన్ఎస్‌జీ-2 జాబితాలో ఉంది. డివిజన్‌లో ఆదాయంలో విజయవాడ తర్వాత ఈ స్టేషను ఉంటుంది. ప్రయాణికులకు సదుపాయాలు కల్పించడంలో భాగంగా 2023 ఆగస్టులో రైలు కోచ్ రెస్టారెంట్‌ని ఏర్పాటు చేశారు. అప్పటికే విజయవాడ తదితర స్టేషన్లలో ఈ కాన్సెప్ట్ మంచి ఫలితాలను ఇచ్చింది. వాడు కలోలేని ఒక రైలు కోచ్‌ని రైల్వే స్టేషను ప్రాంగణంలో ఏర్పాటు చేసి రెస్టారెంట్ మాదిరిగా మారుస్తారు. దీనిలో కూర్చుని తింటే రైలులో తిన్నట్టుగా అనుభూతి చెందాలనేది ప్రధాన ఉద్దేశం. రాజ మండ్రిలో కూడా అదే ఉద్దేశంతో ఏర్పాటు చేశారు. తొలి నుంచీ దీని నిర్వహణ మాత్రం సవ్యంగా లేదు. ఎప్పుడు తెరిచి ఉంటుందో స్థానిక అధికారులకు తెలియదు. ఈ రెస్టారెంట్ ఇక్కడే ఉంటే పుష్కరాల నాటికి పెద్ద సమస్యగా మారే అవకాశం లేకపోలేదు.

నో పార్కింగ్.. వాహనదారుల జేబుకు చిల్లు

ఈ కోచ్ రెస్టారెంట్ కారణంగా రైల్వే స్టేషను ఇరుకుగా మారిపోయింది.. వాహనదారులకు పార్కింగ్ సమస్య వచ్చిపడింది. ఎవరినైనా రైలు ఎక్కించడానికి బైక్‌పై వస్తే బైక్ఎక్కడ పార్క్ చేయాలో తెలియని పరిస్థితి.. నిమిషమైనా బైక్ పార్కింగ్ ఫీజు చెల్లించాల్సిందే. కోచ్ రెస్టారెంట్ చుట్టూ నో పార్కింగ్ బోర్డులే దర్శనమిస్తాయి. ఏ టీ తాగుతూనో అక్కడ వాహనం పార్క్ చేశామా ఆర్‌పీఎఫ్ పోలీసులు వచ్చి జరిమానా విధిస్తున్నారు. కాంట్రాక్టరు పార్కింగ్ ఫీజు కట్టకపోవడంతో ఈ సమస్య వచ్చిందని సమాచారం. వాహనదారులు మాత్రం కోచ్ రెస్టారెంట్ వస్తే వాహనాల పార్కింగ్ ఎక్కడనేది ప్రశ్న.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషనులోని రైలు కోచ్ రెస్టారెంట్ రైల్వేని బురిడీ కొట్టిస్తోంది. అసలు సదుపాయాన్ని పక్కనపెట్టి కొసరుతో గుత్తేదారు వ్యాపారం చక్కబెడుతుండగా.. అడ్డంగా మారిన సదుపాయం ప్రయాణికులకు అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ఇక్కడి నుంచి తర లించాలని.. ఇక్కడ అసలు అవసరమే లేదని వారు అభిప్రాయపడుతున్నారు. రైల్వే స్థలాన్ని గుత్తేదారు తెలివిగా ఉపయోగించుకుంటుంటే స్థానిక అధికారులకు ఆ చిత్రం కనబడడం లేదు.

అసలే ఇరుకు

ఈ రైల్వే స్టేషను ద్వారా రోజుకు 30 వేల మందికి పైగా రాకపోకలు సాగిస్తుంటారు. రద్దీ వేళల్లో వాహనాలు ఎక్కువగా వస్తుంటాయి. కోచ్ రెస్టారెంట్‌ని ప్రధాన ద్వారానికి సమీపంలో కీలకమైన ప్రదేశంలో పెట్టారు. దీంతో ఇక్కడ ప్రదేశం ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. అందువల్ల ఇక్కడి నుంచి ఖాళీ స్థలం ఎక్కువ ఉన్న తూర్పు స్టేషను వైపునకు దీనిని తరలించాలని ప్రయాణికులు కోరుతున్నారు.ఈ కోచ్ రెస్టారెంట్‌ని 24గంటలూ తెరిచి ఉంచే వెసులుబాటు ఉంది. దీంతో రాత్రి వేళల్లో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోంది.

కొసరుతో వ్యాపారం

ఈ కోచ్ రెస్టారెంట్‌ని విజయవాడకు చెందిన ఓ కంపెనీ దక్కించుకొంది. కానీ మేనేజర్ల పేరుతో సబ్-కాంట్రాక్టుకు ఇస్తోంది. సబ్ కాంట్రాక్టరు నుంచి రోజుకు రూ.15 వేల వరకూ.. అంటే నెలకు రూ.4.5 లక్షలు.. ఏడాదికి సుమారు రూ.55 లక్షలు వసూలు చేస్తోంది. ఈ ఆదాయం అలా ఉంటే.. కోచ్ రెస్టారెంట్‌ని ఆనుకొని కొంత ప్రదేశం ఉంది. ఆ ప్రదేశంలో టీ, జ్యూస్, రోజ్ మిల్క్ స్టాల్స్‌ని ఏర్పాటు చేశారు. వాటి నుంచి నెలకు రూ.3 లక్షలు..ఏడాదికి రూ.35 లక్షల వరకూ గుత్తేదారుకు ముడుతోంది. కోచ్ రెస్టారెంట్‌ని తెరవకపోతే ప్రయాణికులకు సదుపాయం ఉండకపోవచ్చు.. కానీ గుత్తేదారు మాత్రం కొసరులతో వ్యాపారం చేసేస్తున్నారు. అసలే అందవికారంగా ఉన్న రైలు కోచ్ రెస్టారెంట్‌ని తీసేసి స్టాల్స్‌ని ఏర్పాటు చేసినా రైల్వేకి ఏడాదికి రూ.కోటి వరకూ ఆదాయం సమకూరుతుంది.

ఇదే కారణమా..

కోచ్ రెస్టారెంట్ అస్తవ్యస్తంగా మారినా.. ఇష్టానుసారం నడిపిస్తున్నా అధికారులు పెద్దగా చర్యలు తీసుకోలేకపోతున్నారు. విజయవాడ రైల్వే డివిజన్ స్థాయిలో ఓ అధికారి అండ మెండుగా ఉండడంతో గుత్తేదారుపై ఎలాంటి చర్యలూ తీసుకోలేకపోతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ధరలను అధికంగా వసూలు చేస్తున్నారు. ధమ్ టీ అంటూ 70 ఎంఎల్ టీని రూ.15కి విక్రయిస్తూ ప్రయాణికులను దోపిడీ చేస్తున్నారు. రైలులో లేదా ప్లాట్‌ఫాంపై 120 ఎంఎల్ టీ రూ.10కే రైల్వే అందిస్తోంది.

- గుత్తేదారు గారడీ.. రైల్వే బురిడీ
- అసలు పడక.. కొసరుతో వ్యాపారం
- తెరవెనుక డివిజన్ స్థాయి అధికారి!
- రైల్వే శాఖ ఉద్దేశం నిర్వీర్యం
- అడ్డంగా మారిన సదుపాయం
- అస్తవ్యస్తంగా రైలు కోచ్ రెస్టారెంట్
- అదిరిపోతున్న ధరలు
- ప్రయాణికుల జేబులు గుల్ల

రోడ్డ దాటి నాలుగు అడుగులు వేస్తే రూ.100-200కే బిర్యానీ లభిస్తేఈ రెస్టారెంట్‌లో రూ.350 వరకూ లాగేస్తున్నారు. టిఫిన్ విష యంలోనూ పరిస్థితి అలాగే ఉంది.డబ్బులకు తగిన పరిమాణం,నాణ్యత ఉండదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తొలగించడంపై దృష్టి సారించాలని ప్రయాణికులు సూచిస్తున్నారు.

'ఖాళీగా ఉన్న క్లాస్-4 ఉద్యోగాలను భర్తీచేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ, తదితరులు

కొవ్వూరు, జూలై12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న క్లాస్-4 ఉద్యో గాలను వెంటనే భర్తీచేయాలని క్లాస్-4 ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ ఉద్యోగుల జిల్లా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణీసుస్మితను కలిశారు. వెంకటరమణ మాట్లాడుతూ మండలంలో కనీసం రెండు అటెండర్ పోస్టులు, ఒక నైట్‌వాచ్ మెన్ పోస్టులు ఉండాలని, అయితే ప్రస్తుతం చాలాచోట్ల ఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఉన్న సిబ్బంది పైనే ఒత్తిడి పెరుగుతుందన్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ఎండీ తాజుద్దీన్, ఎం.సుబ్రహ్మణ్యం, క్లాస్-4 ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను కలిసిన పలువురు



జవహర్‌తో పాటు ఉన్న సఫాయి ఖర్మచారి ఆందోళన్ (నేషనల్) సంఘం

కొవ్వూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కమిషన్ చైర్మన్ జవహర్‌ను సఫాయి ఖర్మచారి ఆందోళన్ (నేషనల్)సంఘం శనివారం మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి శాలువాలతో కప్పి సత్కరించారు. దీర్ఘకాలంగా ఎదుర్కొనే సమస్యలను తెలియజేసి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం కొవ్వూరు మండలం ధర్మవరంలో ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన జొన్నకూటి సౌమ్య కుటుంబాన్ని పరామర్శించి, రూ. 10 ఆర్థిక సాయాన్ని అందజేశారు.

కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రావిశెట్టి రామచంద్రరావు, బొచ్చ అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ భార్గవి మంగవతి, శ్రీనివాస్ యర్రంశెట్టి అప్పారావు, బొబ్బిలి చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి, విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం నియోజకవర్గంలో ఎనిమిది మంది బాధితులకు మంజూరైన రూ. 5,52,064 వేల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, బొండాడ సత్యనారాయణ, సూరపనేని సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు చీర, సారె సమర్పణ



తాడిపర్రులో అమ్మవారికి చీర, సారెను తీసుకువెళుతున్న మహిళలు

ఉండ్రాజవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రులో శనివారం ఆషాఢమాసం సందర్భంగా కనకదుర్గ అమ్మవారికి మహిళలు సారె, చీర సమర్పించారు. అనంతరం కుంకుమ పూజలు, లలిత సహస్రనామ పారాయణ, తదితర పూజలు గావించారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీవారు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

చురుగ్గా కల్వర్టు నిర్మాణ పనులు

గోపాలపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది ముంపునకు గురవుతున్న కారణంగా కల్వర్టు నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించారు. పన్నెండున్నర మీటర్ల వెడల్పు, ఏడు మీటర్ల పొడవుతో నిర్మించే ఈ కల్వర్టు నిర్మాణానికి ఆ శాఖ నిధులు రూ. 30 లక్షలు మంజూరయ్యాయి. దీంతో యుద్ధప్రాతిపదికన సోమాలమ్మ, నక్కిర్లమ్మ చెరువుగట్టు కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

ప్రజా సంక్షేమానికి సీఎం కృషి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ● తాడిమళ్ల, తిరుగుడుమెట్ట, 'గోపాలపురం'లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలు



కొవ్వూరు : 5వ వార్డులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి



కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



కార్యక్రమంలో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మున్సిపాల్టీలోని 5వ వార్డులో శనివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ఏడాది కూటమి పాలనలో అమలుచేసిన పథకాలు, అభివృద్ధిపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. ప్రస్తుతం యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా విద్యాశాఖ మంత్రి లోకేష్ దేశ, విదేశాలలో పర్యటించి పలు ప్రముఖ కంపెనీలను రాష్ట్రానికి ఆహ్వానించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మద్దుల సత్యనారాయణ, కాకర్ల దొరబాబు, సూరపనేని సురేష్, యాగంటి పండు, మద్దుకూరి సురేష్, సూరపనేని నాగదేవి, కాకర్ల సుజాత, దొడ్డపనేని నారాయణమ్మ, పిల్లి ప్రవల్లిక, మద్దుకూరి పద్మిని, పెదవేగి మంగతాయారు, సూరపనేని సీతమ్మ, మద్దిపట్ల రత్నావతి, యండపల్లి వెంకటలక్ష్మి, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందని మాజీఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. శనివారం తాడిమళ్లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శనివారం భీమోలు, చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు దాక వరపు అప్పారావు, పడమటి సత్యనారాయణ, నూతంగి దొరబాబు, గద్దే హరిబాబు, గంధ్రోతు శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ కూనపం ప్రసాద్ బాబు, కొర్లపాటి రాము, జ్యేష్ట శ్రీనివాసరావు, పడమటి శ్రీనివాస్, నూతంగి దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని తిరుగుడుమెట్టలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, గ్రామకమిటీ అధ్యక్షుడు అన్నమరెడ్డి రమణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒకవేళ పథకాలు అందనట్టయితే తెలపాలన్నారు. అనంతరం రెండు కుటుంబాలకు చెందిన వేములపల్లి అమ్మిరాజు, రాపాక రాధాకృష్ణకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు అన్నమరెడ్డి సత్తిబాబు, సోమశేఖర్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే ...

తిరుగుడుమెట్ట నుంచి ఎమ్మెల్యే తిరిగి వస్తుండగా అప్పటికే రెడ్డు ప్రమాదానికి గురై రోడ్డు పక్కన ఉన్న కొమ్మిశెట్టి హేమంత్ అనే యువకుడి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. 108 వాహనం వచ్చేవరకూ వేచి చూడొద్దని పోలీస్ జీపులో ఆయన దగ్గరుండి ఆస్పత్రికి తరలించారు.

కిటకిటలాడిన దేవరపల్లి వెంకన్న ఆలయం



ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

దేవరపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు కాలినడకన వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ ఆలయంలో భక్తులు ఎక్కువ శాతం 108 ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించు కోవడం విశేషం. స్వామివారికి ప్రసాద వితరణను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సుజాత దంపతులు స్వామివారికి అలంకరణ చేశారు. దాతలు పిన్నమని ప్రసాద్, సత్యనాగిని దంపతులు ఎమ్మెల్యేకు స్వామివారి దర్శన అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు కేశవచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు వేదాశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో స్థానికులు ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, స్థానికులు తీగల బలరామయ్య, గుడ్ల వెంకటేశ్వర రావు, కొండపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్ష



నిడదవోలులో రిలే నిరాహార దీక్ష చేస్తున్న దృశ్యం

నిడదవోలు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ స్మార్ట్‌మీటర్లు బిగించే ప్రక్రియతో భవిష్యత్‌లో ప్రజలకు పెనుభారంగా మారనుందని కాంగ్రెస్ పార్టీ నిడదవోలు నియోజకవర్గ కోఆర్డినేటర్ మేడవరపు భద్రందొర అన్నారు. శనివారం పట్టణంలోని డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు అదానీ జేబు నింపడమే అని ప్రజల కోసం కాదని అన్నారు. కార్యక్రమంలో చిన్నం మురళీకృష్ణ, అరిగెల అరుణ కుమారి, అగర్వాల్ హీరా లాల్, భావన రమేష్, పెచ్చేటి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోచవరంలో సీసీ రోడ్డు నిర్మాణం



పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్, స్థానిక నాయకులు

తాళ్లపూడి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచవరం పంచాయతీ ఎస్సీ కాలనీ ఏరియాలో సీసీ రోడ్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. స్థానిక మెయిన్ రోడ్డును కలిపే రహదారి నిర్మాణానికి గ్రామ పంచాయతీ నిధులు రూ. ఎనిమిది లక్షల 60 వేలు కేటాయిస్తూ చేపట్టినట్టు గ్రామసర్పంచ్ కాకర్ల హైమావతి తెలిపారు. గ్రామంలో డ్రైన్ల నిర్మాణాల అవసరం ఉందని, ఈ విషయమై ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు తెలియపరిచామన్నారు. కార్యక్రమంలో స్థానిక నేత కాకర్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య చర్చి వద్దు

తాళ్లపూడి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మండలంలోని పెద్దేవం సంపత్ వినాయకుడి గుడి ఎదురుగా చర్చి ఏర్పాటు చేయడంపై హిందూమతానికి చెందిన యువత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆ చర్చి వద్ద ఆందోళనకు దిగుతూ అక్కడే బైఠాయించారు. వారు మాట్లాడుతూ వినాయకుడి గుడి ఎదురుగా కిరాణా షాపు నడుపుకునే వ్యక్తి క్రైస్తవ్యాన్ని నమ్ముకుని ప్రార్థనలు చేస్తూ ఇంటిపై చర్చిని ఏర్పాటు చేసుకున్నాడన్నారు. దీంతా తామంతా అభ్యంతరం తెలుపుతూ ఆందోళనకు దిగామన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ముప్పిడి పరామర్శ



లక్ష్మి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మలకపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీసర్పంచ్ మద్దిపాటి ప్రకాశం మాతృమూర్తి ఇటీవల మృతిచెందాడు. దీంతో ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం ప్రకాశం కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మద్దిపాటి లక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈయనతోపాటు మద్దుకూరి శ్యామసుందరరావు, చెరుకూరి సత్యనారాయణ, ఇమ్మణ్ణి శంకరం, తదితర టీడీపీ నాయకులు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొవ్వూరు, జూలై12 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం దొమ్మేరు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ దొమ్మేరు, 11 కేవీ దొమ్మేరుసావరం, 11 కేవీ కాపవరంలో నిడదవోలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎన్. నారాయణ అప్పారావు తెలిపారు. వార్షిక మరమ్మత్తుల కారణంగా ఈనెల 14వ తేదీ సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు, ప్రజలు సహకరించాలని కొవ్వూరు రూరల్ ఏఈ సీహెచ్ శ్రీనివాసరావు కోరారు.

వ్యక్తిని కొట్టి, చంపేస్తామని బెదిరించిన ఇద్దరిపై కేసు

కొవ్వూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని కొట్టి, చంపేస్తామని బెదిరించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరురూరల్ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.భగవాన్‌దాస్ తెలిపారు. తోగుమ్మికి చెందిన సుంకవల్లి కృష్ణారావు ఈ నెల 9వ తేదీన పొలం చూసుకోవడానికి వెళ్లాడు. అయితే పొలం సరిహద్దులో ఉన్న తూరలు పక్కకు వేయమని చెప్పడంతో సరిహద్దుదారులు ఉప్పులూరి రమేష్, ప్రసాద్ కృష్ణారావుని కిందపడవేసి కొట్టి, చంపేస్తామని బెదిరించినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'సత్యసాయి కార్మికులకు జీతాలు చెల్లించాలి'

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం పురుషోత్తపట్నంలోని శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి కార్మికులకు 19 నెలలుగా జీతాలు, 26 నెలలుగా ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ కోరారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరం లాలాచెరువు సెంటర్లోని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న కార్మికులకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ఐదు రోజుల నుంచి సత్యసాయి కార్మికులు సమ్మె చేస్తున్నా కాంట్రాక్టర్ కానీ, అధికారులు కానీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మెకు ఆర్‌డబ్ల్యుఎస్, సీపీడబ్ల్యు స్కీమ్స్ రాష్ట్ర యూనియన్ సభ్యులు రాయుడు శ్రీను, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు తమ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇసాక్, కార్మికులు పాల్గొన్నారు.

15న కలెక్టరేట్ వద్ద ప్రభుత్వ పెన్షనర్ల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12(ఆంధ్ర జ్యోతి): అలిండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌జీపీఎఫ్)పిలుపు మేర కు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఈనెల 15న శాంతియుత ధర్నా నిర్వహిస్తున్నామని రాజమహేంద్రవరం పెన్షనర్స్ అధ్యక్షుడు కేకే సంజీవరావు తెలిపారు. 15న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ధర్నా చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లుతో పాటు ప్రవేశ పెట్టిన వేలిడేషన్ అమెండ్మెంట్‌ను రద్దుచేయాలని, 12వ పే కమిషన్ నియమించి తక్షణం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఆర్ సహా అన్ని బకాయిలను చెల్లించాలనే డిమాండ్ల సాధనల కోసం ధర్నా చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ శాంతియుత ధర్నాలో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, క్లాస్4 , డ్రైవర్లు, రిటైర్డ్ కార్మికులు రావాలని పిలుపునిచ్చారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం

● పీడీజే గంధం సునీత



రాజమహేంద్రవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో వివిధ శాఖల అధికారులతో ఎస్పీ నరసింహ కిషోర్ అర్ధ సంవత్సర సమన్వయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పీడీజే విచ్చేశారు. పోలీసులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని సందర్శించారు. పోలీసులు ఉపయోగించే డ్రోన్లు తదితర సరంజామా గురించి ఆమెకు ఎస్పీ వివరించారు. అనంతరం సమావే శంలో ఆమె మాట్లాడుతూ దర్యాప్తులు, విచారణ, తదితర అంశాల్లో జరుగుతున్న పొరబాట్లు, సరిదిద్దుకునే విధానం వంటివి ప్రధాన న్యాయమూర్తి వివరించారు. పోలీసులు నిత్యం విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అర్ధ సంవత్సర నేర సమీక్షను ఎస్పీ నిర్వహించారు. కేసుల దర్యాప్తుల్లో ప్రతిభ కనబరిచిన అధికారులను సత్కరించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి, పోలీసు, రెవెన్యూ, న్యాయ, వైద్య, మునిసిపల్, ఫోరెన్సిక్, ఆర్ అండ్ బీ, పీఆర్, ఆర్టీఏ, ఎన్‌హెచ్, ఎక్సైజ్, జైళ్లు, రైల్వే, విద్య, ఆర్టీసీ, విపత్తు నిర్వహణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉధృతంగా గోదావరి

- ఎగువున తగ్గుముఖం
- ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 5,29,209 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి
- మరింత పెరగనున్న ఉధృతి



ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తూ సముద్రంవైపు ప్రవహిస్తోంది. ఇదే సమయంలో ఎగువున ఉధృతి తగ్గుముఖం పడుతోంది. శుక్రవారం సాయంత్రానికి ధవళేశ్వరం వద్ద 3.5లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి కలవగా శనివారం సాయంత్రానికి 5,29,209 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా సముద్రంలోకి ప్రవహిస్తోంది. దీంతో బ్యారేజి దిగువన ఉన్న లంకలో ఇసుక మైదానం పూర్తిగా వరద ప్రవాహంతో నిండిపోయింది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.60 అడుగులకు చేరుకుంది. ఆదివారం నాటికి నీటి మట్టం మరింత పెరిగి సుమారు 7లక్షల క్యూసెక్కులకు పైగా ఎగువ నుంచి రావచ్చని ఫ్లడ్ సెక్షన్ అధికారులు అం చనా వేస్తున్నారు. ఈ మేరకు ఆయా అధికారులకు కేటాయించిన పరిధిలో ఫ్లడ్ డ్యూటీల్లో అప్రమత్తంగా ఉన్నారు. కాగా ఎగువున భద్రాచలం వద్ద 41.40 అడుగులకు పెరిగిన నీటి మట్టం ఆపై నిలకడగా కొనసాగి తగ్గుముఖం పట్టింది. శనివారం మధ్యాహ్నం 4గంటలకు 1పాయింట్ తగ్గి 41.30 అడుగులకు చేరుకుంది.

ఎగువ నీటి మట్టాలు ఇవే

ఎగువన అన్ని ప్రాంతాల్లో వరద ఉధృతి నెమ్మదించింది. దీంతో వరద నీటి మట్టం తగ్గుదల నమోదయింది. శనివారం మధ్యాహ్నం 4గంటలకు కాళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 9.27మీటర్లుగా నమోదు కాగా, పేరూరి వద్ద 14.35మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 11.60 మీటర్లు, భద్రాచలం వద్ద 41.30 అడుగులు, కూనవరం వద్ద 16.02మీటర్లు, కుంట వద్ద 7.05 మీటర్లు, పోలవరం వద్ద 10.68మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 14.68మీటర్లుగా నీటి మట్టం నమోదైంది.

ప్రమాద హెచ్చరికలు..

కాటన్ బ్యారేజ్ 175గేట్లు పూర్తిగా ఎత్తివేసిన స్థితిలో 10లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు దిగువకు ప్రవహించడంతో పాటు గోదావరి నీటి మట్టం 11.75 అడుగులకు చేరుకుంటే మొదటి ప్రమాదహెచ్చరిక జారీ చేస్తారు. ఆపై 13లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తున్న సమయంలో నీటిమట్టం 13.75 అడుగులకు చేరుకుంటే రెండో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. 18 నుంచి 19లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తున్న సమయంలో నీటి మట్టం 17.50 అడుగులకు చేరుకుంటే చివరి ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది.

రోడ్డుపైకి వరద.. నిలిచిన రాకపోకలు

వీఆర్ పురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతరేవుపల్లి, కన్నాయిగూడెం ప్రధాన రహదారిపైకి వరదనీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఐటీడీఏ పీవో అపూర్వభరత్ వరద నీరు చేరిన ప్రాంతాన్ని పరిశీలించారు.అక్కడ పోలీసులను కాపలా ఉంచారు. అన్నవరం చప్టాకు ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. పెద్దమట్టపల్లిలోని ఆరోగ్య ఉపకేంద్రంలో తగినన్ని మందులు అందుబాటులో ఉంచాలని, డాక్టర్‌ను ఉంచాలని డీఎంఅండ్‌హెచ్‌వో పల్లయ్యకు ఆదేశాలిచ్చారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాల కృష్ణారెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

వరద తీవ్రత తగ్గుముఖం!

చింతూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వరద తీవ్రత తగ్గనున్నట్టు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ పేర్కొన్నారు. శనివారం పీవో కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. సీడబ్ల్యుసీ సమాచారం మేరకు శనివారం రాత్రి 7 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 41అడుగులకు చేరుకుందన్నారు.అర్థరాత్రి నుంచి క్రమంగా తగ్గనున్నట్టు సీడబ్ల్యుసీ అంచనా వేసిందన్నారు. దీంతో ఈ వారంలో వరద ముప్పు లేనట్లేనన్నారు. కాగా గోదావరి ఎగపోటుతో శబరి నది క్రమంగా పెరిగి తదుపరి వరద తీవ్రత తగ్గనుందన్నారు. అయినప్పటికీ లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గండిపోశమ్మ గోపురానికి వరదనీరు

దేవీపట్నం, జూలై 12(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజుల నుంచి గోదావరి ఉధృతంగా పెరగడంతో మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం చుట్టూ వరదనీరు చేరి శనివారం నాటికి గోపురాన్ని తాకింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శబరి, కిన్నెరసాని తదితర నదులు పొంగి ప్రవహించడంతో గోదావరి పరీవాహక ప్రాంతాలకు వరదనీరు చేరింది. అమ్మవారి ఆలయం వద్ద దేవస్థాన అధికారుల కార్యాలయం, నిర్మాణాలు, భక్తుల కోసం నిర్మించిన షెడ్లు మునిగిపోయాయి. గోదావరిలోకి ఎవరినీ వెళ్లనీయకుండా శనివారం ఎస్ఐ షరీఫ్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

ఏపీ ట్రాన్స్ కో క్రికెట్ జట్టు కెప్టెన్‌గా శ్రీరామకృష్ణ



కడియం, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్ కో, జెన్‌కో డిస్కం క్రికెట్ జట్టు కెప్టెన్‌గా తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం దుళ్ల లైన్ మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న అడబాల శ్రీరామకృష్ణ ఎంపికయ్యారు. ఈ మేరకు ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఉత్తర్వులు ఇచ్చింది. 20 మందిని జట్టుకు ఎంపిక చేయగా కెప్టెన్‌గా అడ బాల శ్రీరామకృష్ణ, వైస్ కెప్టెన్‌గా విశాఖపట్నానికి చెందిన టి.అభిషేక్‌ను ఎంపిక చేశారు. కాగా శ్రీరామకృష్ణ స్వస్థలం చెముడులంక-గాంధీనగరం. చిన్నతనం నుంచి క్రికెట్‌లో రాణించేవారు. లైన్‌మెన్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ మరో ప్రక్క క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్నారు. బౌలింగ్, బ్యాటింగ్‌లలో ప్రతిభ కనబరుస్తున్నారు.

15 నుంచి తత్కాల్‌కి ఆధార్ ఓటీపీ కచ్చితం

- అవతవకలకు చెక్ పెట్టే దిశగా రైల్వే
- ఇప్పటికే ఆన్‌లైన్ టికెట్లకు అమలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తత్కాల్ టికెట్లలో జరుగుతున్న అవకతవకలను అడ్డుకట్ట వేసే దిశగా రైల్వే ఈ నెల 15 నుంచి ఆధార్‌ని కచ్చితం చేసింది. ఇప్పటికే ఈ విధానం ఆన్‌లైన్ టికెట్ల విషయంలో అమలవుతోంది. ఇప్పుడు కౌంటర్ల వద్ద తీసుకొనే టికెట్లకు కూడా అమలు చేయనున్నారు. టికెట్ తీసుకునే వారు తమ ఫోన్‌తో లింక్ అయిన ఆధార్ నెంబరును రిజర్వేషను దరఖాస్తులో రాయాల్సి ఉంటుంది. టికెట్ ఇచ్చే సమయంలో ఆ నెంబరుకు ఓటీపీ వస్తుంది. దానిని కంప్యూటర్‌లో నమోదు చేస్తేనే టికెట్ బుక్ అవుతుంది. ఇప్పటికే ఆ విధంగా రైల్వే సాఫ్ట్‌వేర్‌ని అప్‌డేట్ చేశారు. ఆధార్ నెంబరుతో లింక్ అయిన మొబైల్ నెంబరు మాత్రమే దరఖాస్తులో నింపాల్సి ఉంటుంది. టికెట్ తీసుకున్న వాళ్ల ప్రయాణం చేయకపోయినా.. సదరు టికెట్ ద్వారా ప్రయాణం చేసే వారి సమాచారం టికెట్ తీసుకున్న వారికి కచ్చితంగా తెలియాల్సి ఉంటుంది. అత్యవసర సమయంలో ఆ నెంబరుకే రైల్వే సమాచారం ఇస్తుంది. కాగా.. ప్రస్తుతం తత్కాల్ టికెట్ బుకింగ్ ఓపెన్ అయిన సెకన్లలోనే కోటా ముగిసిపోతోంది. ఒక్క నిమిషం దాటితే వెయిటింగ్ లిస్టులోకి వెళ్లిపోతోంది. గోదావరి, గౌతమి వంటి రైళ్లకు అయితే తత్కాల్ ఓపెన్ అయిన వెంటనే మొదటి టికెట్ దొరికితే అదృష్టమేనని చెప్పవచ్చు. తాత్కాల్ టికెట్లను అత్యవసర, తప్పనిసరి సమయంలో మాత్రమే అధిక శాతం జనం బుక్ చేసుకుంటారు. అందువల్ల వెయిటింగ్ లిస్టు టికెట్లు కన్‌ఫర్మ్ కావడం దాదాపుగా కష్టమనే చెప్పవచ్చు. ఇప్పుడు ఓటీపీ విధానం వల్ల కొద్ది సెకన్లు ఆలస్యం తప్పదు. ఒకవేళ ఆధార్ లింక్‌డ్ మొబైల్‌కి సాంకేతిక, నెట్‌స్లో వల్ల ఓటీపీ రాకపోతే సమయం వృథా.. టికెట్ దొరకని వ్యథ తప్పకపోవచ్చు. అయితే తత్కాల్ టికెట్లు అవసరమైన ప్రయాణికులకు దక్కడం లేదనే ఫిర్యాదులున్నాయి. ఈ టికెట్లు తీసుకోవడం కూడా ఓ అనధికారిక వ్యాపారంగా మారిపోయింది. దీనికీ ఏజెంట్లు పుట్టుకొచ్చారు. టికెట్‌పై కొంత మొత్తం అదనంగా తీసుకొని తత్కాల్ లైనులో ఎవరో ఒకరు నించొని టికెట్ తీసుకుంటున్నారు. తత్కాల్ టికెట్ అప్లికేషన్లలో ఏదో ఒక పేరు నింపేసి కౌంటరు వద్ద సీరియల్ నెంబర్లు వేసి లైనులో పెడుతున్నారు. దీంతో తత్కాల్ టికెట్ అవసరమైన వాళ్లు ఆ ఏజెంట్లను ఆశ్రయించక తప్పడం లేదు. వీటన్నిటికీ చెక్ పెట్టే దిశగా ఆధార్ ఓటీపీని రైల్వే అమల్లోకి తీసుకొస్తోంది.